


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి బుధవారం 06-07-2022 సంపుటి: 03 సంచిక: 282 పేజీలు: 4 వెల: రూ 3-00


## ఆ చిన్నారిని కలిశాక.. నాలో విశ్వాసం పెరిగింది: మోదీ



గాంధీనగర్: గుజరాత్‌లోని గాంధీనగర్‌లో 'డిజిటల్ భారత్' వారోత్సవాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓ 11 ఏళ్ల దివ్యాంగ చిన్నారితో ముచ్చటించిన ప్రధాని.. ఆ బాలుడ్ని చూసి ముచ్చటపడి పోయారు. ఆ చిన్నారిని కలిశాక.. ఈ దేశం ఎక్కడా ఆగిపోదని తనలో విశ్వాసం మరింత పెరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. డిజిటల్ ఇండియా వారోత్సవాలను ప్రారంభించిన ప్రధాని.. అక్కడ ప్రదర్శనకు ఉంచిన పలు నూతన ఆవిష్కరణలను తిలకించారు. ఈ సందర్భంగా థింకర్‌బెల్ ల్యాబ్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న 11 ఏళ్ల ప్రథమేశ్ సిన్హాతో ప్రధాని ముచ్చటించారు. ఈ సంస్థ అంధులు బ్రెయిలీ లిపిని సులభంగా నేర్చుకునేందుకు వీలుగా 'యాన్నీ' అనే గ్యాడ్జెట్‌ను తయారు చేసింది. ప్రథమేశ్ ఈ పరికరం గురించి ప్రధానికి వివరించాడు. అతడు చెబుతున్నంతసేపు ఎంతో ఆసక్తిగా విన్న మోదీ.. 'నువ్వు ఎక్కడి నుంచి వచ్చావ్?' అంటూ చిన్నారిని అడిగాడు. 'పుణె నుంచి వచ్చాను' అని చెప్పగా.. మోదీ చిన్నారి తలనిమిరి అభినందించారు. అనంతరం మోదీ ప్రసంగిస్తూ ప్రథమేశ్ గురించి ప్రస్తావించారు. ''నేను ఆ బాలుడితో మాట్లాడినప్పుడు అతడు.. ఆ కంపెనీ బ్రాండ్ అంబాసిడర్ అంటూ తనను తాను పరిచయం చేసుకున్న తీరు నన్ను అబ్బుర పర్చింది. ఇలాంటి వాళ్లను కలిసినప్పుడే.. ఈ దేశం ఎక్కడా ఆగిపోదని, భవిష్యత్తు కలలను సాకారం చేసుకుంటుందని నాలో విశ్వాసం మరింత పెరుగుతుంది" అని మోదీ ఆ చిన్నారిని అభినందించారు. ఈ వీడియోను థింకర్‌బెల్ ల్యాబ్స్ సోషల్‌మీడియాలో షేర్ చేస్తూ..''విద్య అందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే వేం ఈ పరికరాన్ని రూపొందించాం. చదువుకోవాలనుకునే చిన్నారులకు వైకల్యం అడ్డు కాకూడదు. ప్రథమేశ్ లాగే.. ఎంతోమంది అంధ చిన్నారులకు యాన్నీ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ గ్యాడ్జెట్ గురించి ప్రథమేశ్ ప్రధానికి వివరించడం మాకు చాలా గర్వంగా ఉంది" అని రాసుకొచ్చింది. ఈ వీడియోను భాజపా కూడా తమ ట్విటర్ ఖాతాలో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. పుణెకు చెందిన ప్రథమేశ్ పుట్టుకతోనే అంధుడు. కానీ ఆ లోపాన్ని అధిగమించి తన టాలెంట్‌తో ఎంతోమంది దృష్టిని ఆకర్షించాడు. గతేడాది తాను ప్రచారకర్తగా ఉన్న థింకర్‌బెల్ ల్యాబ్స్ తరఫున ప్రముఖ షో షార్క్ ట్యాంక్‌లో పాల్గొన్నాడు. అక్కడ 'యాన్నీ' గ్యాడ్జెట్ గురించి అతడు ఇచ్చిన ప్రజెంటేషన్‌తో ఎంతోమంది హృదయాలను గెలుచుకున్నాడు. ఈ ప్రొగ్రామ్ చూసిన బోట్ (ఎసీయి) లైఫ్‌స్టైల్ సీఈఓ అమన్ గుప్తా.. ప్రథమేశ్‌ను తన ఆఫీసును ఆహ్వానించారు. అంతేగాక, ఒకరోజు బోట్ సీఈఓగా పనిచేసే అద్భుత అవకాశమిచ్చారు.

## పిల్లల చదువు కోసం ఎక్కడా వెనక్కి తగ్గేదిలే: సీఎం జగన్





నంద్యాల జిల్లా: కార్పొరేట్ స్కూళ్ల పిల్లలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సైతం చదువుల్లో రాణించేందుకు వారికి అవసరమైన అన్ని వనరులను కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది కూడా జగనన్న విద్యాకానుక (జేవీకే) స్టూడెంట్ కిట్లను పంపిణీ చేసింది. వేసవి సెలవుల అనంతరం 2022?23 విద్యా సంవత్సరానికి సంబంధించి స్కూళ్లు ప్రారంభమైన తొలిరోజు జూలై 5న సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా విద్యార్థులకు ఈ కిట్లు అందించారు. కర్నూలు జిల్లా ఆదోనిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వీటి పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న 47,40,421 మంది విద్యార్థులకు ఇవి అందనున్నాయి. ఇందుకోసం రూ.931.02 కోట్లను ప్రభుత్వం వ్యయంచేస్తోంది. విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు సంస్కరణలు చేపట్టిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ..'దేవుని దయతో ఈ రోజు మంచి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. 47.40 లక్షల మంది విద్యార్థులకు విద్యాకానుకను అందిస్తున్నాం. విద్యాకానుక కోసం రూ.931 కోట్లు ఖర్చు చేస్తున్నాం. పేదరికం నుంచి బయటపడాలంటే ప్రతి ఇంట్లో మంచి చదువు ఉండాలి. నాణ్యమైన చదువుతోనే పేదరికం పోతుంది. నాడు-నేడు కింద? ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చాం. జగనన్న గోరుముద్ద పథకంతో బడి పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నాం. బైజూస్ యాప్‌నుపేద పిల్లలకు అందుబాటులోకి తెస్తున్నాం. విద్యార్థుల కోసం బైలింగువల్ పాఠ్యపుస్తకాలు ఇచ్చాం. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ కూడా అందజేస్తున్నాం. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చాం. పిల్లల భవిష్యత్‌పై దృష్టిపెట్టిన ప్రభుత్వం మాది. విద్యాసంవత్సరం ఆరంభంలోనే విద్యాకానుక అందిస్తున్నాం. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు ఇస్తున్నాం. ఒక్కో కిట్ విలువ రూ.2వేలు. విద్యార్థుల ఖర్చు గురించి ఎక్కడా వెనక్కి తగ్గలేదు. 8వ తరగతిలో అడుగుపెట్టే ప్రతి విద్యార్థికి ట్యాబ్. రూ.12వేల విలువైన ట్యాబ్ విద్యార్థులకు ఇస్తున్నాం. 2020-21లో విద్యాకానుకకు రూ.648 కోట్లు ఖర్చు చేశాం. 42.34 లక్షల మందికి లబ్ధి చేకూరింది. 2021-22లో విద్యాకానుకకు రూ.789 కోట్లు ఖర్చు చేశాం. 45.71లక్షల మందికి లబ్ధి చేకూరింది. మూడో ఏడాదిలో విద్యాకానుకకు రూ.931 కోట్లు ఖర్చు చేస్తుండగా.. 47.40 లక్షల మంది లబ్ధి పొందుతున్నారు. విద్యాకానుకలో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, 3 జతల యూనిఫామ్ క్లాత్, జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్ట్, స్కూల్ బ్యాగ్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ ఇస్తున్నాం. ఎందుకు ఈ కార్యక్రమం చేస్తున్నామంటే.. బడిమానేసే పిల్లలు తగ్గాలి. పిల్లల్ని బడికిపంపేలా, పెద్ద చదువులు చదివించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. సామాజిక, ఆర్థిక అంతరాలు తగ్గాలి.

## వైఎస్సార్‌సీపీ ప్లీనరీలో పార్టీ నియమావళికి సవరణలు



అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్లీనరీలో పార్టీ నియమావళికి సంబంధించి కొన్ని సవరణలను ప్రతిపాదించి.. వాటిని ఆమోదానికి పెడతామని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి తెలిపారు. అలాగే ప్లీనరీలో అనేక అంశాలపై చర్చిస్తామని.. తీర్మానాలు కూడా ఉంటాయన్నారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సమీపంలో ప్లీనరీ సమావేశాల నిర్వహణ ఏర్పాట్లను సోమవారం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే కొడాలి నాని, తదితరులతో కలసి విజయసాయిరెడ్డి పరిశీలించారు. అనంతరం ప్లీనరీ ప్రాంగణం వద్ద విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. వక్తలందరూ వివిధ ముఖ్యమైన అంశాలపై ప్రసంగిస్తారని తెలిపారు. ముఖ్యంగా విద్య, వ్యవసాయం, వైద్యం, మహిళా సాధికారత, సామాజిక న్యాయం, మీడియా పక్షపాత వైఖరిపై ప్రసంగిస్తారన్నారు. వాటిపై తీర్మానాలు చేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ, జిల్లా స్థాయి ప్లీనరీ సమావేశాలకు అద్భుతమైన స్పందన వచ్చిందన్నారు. ప్లీనరీ జరిగే ఈ నెల 8, 9 తేదీల్లో రెండ్రోజులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభా వేదికపైనే ఉండి వివిధ తీర్మానాలను చర్చించి ఆమోదిస్తారని తెలిపారు. ప్లీనరీ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నారో స్పష్టంగా తెలుస్తోందన్నారు. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందినవారు, సామాజిక న్యాయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణాల్లోని పేదలంతా సీఎం వైఎస్ జగన్ పరిపాలన పట్ల సానుకూలంగా స్పందిస్తున్నారని తెలిపారు. ప్లీనరీకి వచ్చేవారికి భోజన ఏర్పాట్లతోపాటు వార్డు సభ్యుల నుంచి పైస్థాయి నాయకుల వరకు అందరికీ అన్ని వసతులు కల్పిస్తున్నామని చెప్పారు.

సీఎం చెప్పే ప్రతి మాట దిక్సూచి: మంత్రి బొత్స దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి రోజున ఆయనను స్మరించుకుంటూ పార్టీ ప్లీనరీ సమావేశాలు ప్రారంభమవుతాయని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. జూలై 8న పార్టీ జెండా వందనం, అధ్యక్షుడి ప్రారంభ ఉపన్యాసంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 9వ తేదీ అధ్యక్షుడి ముగింపు ఉపన్యాసంతో సమావేశాలు ముగుస్తాయన్నారు. సమావేశాలకు తరలివచ్చే వారికీ ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ చెప్పే ప్రతిమాట రాబోయే రెండేళ్లలో అటు పార్టీకి, ఇటు ప్రభుత్వానికి దిక్సూచిగా ఉంటుందన్నారు. ఆ స్ఫూర్తితో పార్టీని బలోపేతం చేయడంతోపాటు ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్లీనరీ సమావేశాలను విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి కోరారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ప్లీనరీపై ముఖ్య నేతలతో చర్చించారు.

## స్టార్టప్‌లో ఏపీ చివరి స్థానంలో ఉండడం బాధకరం : నారా లోకేశ్



అమరావతి : ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విధ్వంసక చర్యల వల్ల అనేక వ్యవస్థలు నాశనం అవుతున్నాయని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. స్టార్టప్‌లో ఏపీ చివరి స్థానంలో నిలవడం బాధకరమని పేర్కొన్నారు. బిహార్‌తో పాటు ఏపీ చివరన ఉండడం దురదృష్టకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2018-19లో అంకురాల అభివృద్ధిలో ఏపీ అగ్రగామిగా ఉందని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో అనేక స్టార్టప్‌లు విజయవ ంతంగా ఏర్పడ్డాయని వివరించారు.

## దేశంలో తగ్గిన కరోనా కేసులు.. కొత్తగా 13వేలకుపైగానే..

న్యూఢిల్లీ : దేశంలో కరోనా కేసుల సంఖ్య కాస్త తగ్గింది. గడిచిన 24 గంటల్లో కొత్తగా 13,086 కేసులు రికార్డయ్యాయని కేంద్ర కుటుంబ ఆరోగ్యమంత్రిత్వ శాఖ మంగళవారం తెలిపింది. నిన్నటితో పోలిస్తే 18శాతం తక్కువ కేసులు నమోదయ్యాయి. నిన్న 16వేలకుపైగా కేసులు వెలుగు చూశాయి. తాజాగా 12,456 మంది బాధితులు కోలుకోగా.. మరో 24 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 1.14లక్షల మార్క్‌ను దాటింది. తాజా కేసులతో దేశంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 4,35,31,650కు చేరింది. ఇందులో 4,28,91,933 మంది కోలుకోగా.. 5.25లక్షలకుపైగా మంది ప్రాణాలు కోల్పో యారు. ప్రస్తుతం దేశంలో 1,14,475 యాక్టివ్ కేసులు కేసులున్నాయి. ప్రస్తుతం రోజువారీ పాజిటివిటీ రేటు 2.90శాతంగా ఉందని ఆరోగ్యశాఖ పేర్కొంది. 24గంటల్లో 4,51,312 పరీక్షలు నిర్వహించగా.. ఇప్పటి వరకు 86.44కోట్ల పరీక్షలు నిర్వహించినట్లు చెప్పింది. టీకా డ్రైవ్‌లో భాగంగా ఇప్పటి వరకు 198.09 కోట్ల డోసులు పంపిణీ చేసినట్లు వివరించింది.

## డేటా చోరీ జరిగింది.. అవసరమైతే కొందరిని హౌజ్ కమిటీ ముందుకు పిలుస్తాం: భూమన



అమరావతి: పెగాసెస్, ఫోన్ ట్యాపింగ్‌పై హౌజ్ కమిటీ మంగళవారం భేటీ అయ్యింది. చైర్మన్ భూమన కరుణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హౌస్ కమిటీ సభ్యులు కోటారు అబ్బయ్య చౌదరి, మొండితోక జగన్మోహన్ రావు పాల్గొన్నారు. హోం, ఐటీశాఖల నుంచి హౌజ్ కమిటీ సమాచారం సేకరించింది. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ.. 2016-2019 మధ్య అప్పటి ప్రభుత్వం వ్యక్తుల ప్రైవేటు భద్రతకు ముప్పు వాటిల్లే చర్యలు తీసుకుందని ఆరోపించారు. తమకు అనుకూలంగా ఉన్నవారి ఓట్లను ఉంచి ఇతరుల ఓట్లు తొలగించిందనే ఆరోపణలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం దుర్మార్గపు చర్యలు తీసుకుందని మండిపడ్డారు. కావాలనే డేటా దొంగిలించి రాజకీయ లబ్ధి పొందినట్లు స్పష్టత వచ్చిందన్నారు. ఏపీ, తెలంగాణలో డేటా చోరీ జరిగిందని తెలంగాణ ప్రభుత్వం కూడా దర్యాప్తు చేసిందన్నారు. ప్రభుత్వం దగ్గర ఉండాల్సిన డేటాను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి ఇచ్చిందని విమర్శించారు. డేటా చోరీ జరిగిందన్న భూమన కరుణాకర్‌రెడ్డి అవసరమైతే కొందరిని హౌస్ కమిటీ ముందుకు పిలుస్తామన్నారు.

## జలమయమైన ముంబయి..

### మరోసారి భారీ వర్ష సూచన



ముంబయి: దేశ వాణిజ్య రాజధాని ముంబయిని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. నిన్న రాత్రి నుంచి కురిసిన వర్షానికి నగరం జలమయమైంది. లోతట్టు ప్రాంతాలు మునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా.. రానున్న 24 గంటల్లో అతి భారం వర్షం కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ముంబయి నగరంలో 95.81 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శివారు ప్రాంతాల్లోనూ 110 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. పట్టాలపై నీరు నిలవడంతో పలు చోట్ల లోకల్ రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. కొన్ని రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. రహదారులపైకి భారీగా నీరు చేరడంతో ముంబయిలోని 8 మార్గాల్లో ట్రాఫిక్‌ను దారిమళ్లించారు. రానున్న గంటల్లో మరోసారి భారీ వర్షం కురిసే అవకాశమున్న నేపథ్యంలో నగరవాసులను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ముంబయితో పాటు ఠాణే, పాల్ఘర్, పుణెల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఠాణేలో సోమవారం ఉదయం నుంచి ఈ ఉదయం వరకు 146 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. పాల్ఘర్‌లో వర్ష ప్రభావానికి ఓ ఇల్లు కూలింది. కల్యాణ్, భీవండి ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు నీటమునగడంతో అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అమరావతి జిల్లాలో కురిసిన భారీ వర్షానికి వీధులు నదులను తలపిస్తున్నాయి. రాయగఢ్ జిల్లాలోని కుండలీకా నది ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తోంది. ముంబయిలోని ఘాట్కోపర్ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి కొండచరియలు విరిగిపడ్డాయి. సమాచారమందుకున్న స్థానిక అధికారులు, రెస్క్యూ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలుస్తోంది.

# సంపాదకీయం

బుధవారం 06-07-2022

## మహారాష్ట్రలో బలమైన వ్యూహం

కొన్ని అందరికీ తెలిసే జరుగుతాయి. మరికొన్ని జరిగిన తర్వాతే తెలుస్తాయి. కొన్నింటికి వ్యూహ రచన చాలా రోజుల క్రితమే జరుగుతుంది. జరిగిన తర్వాత అందరూ ఆశ్చర్యపడతారు. మహారాష్ట్ర సంక్షోభానికి తెరపడటం, శివసేన నాయకుడు షిండే ముఖ్యమంత్రి కావడం మూడవ కోవలోకే వస్తుంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ముందు ఫడ్నవీస్‌ను అనుకుని ఆనక షిండేను ప్రకటించడం, ఫడ్నవీస్‌ని ఉప ముఖ్య మంత్రిని చేయడం చాలామందిని ఆశ్చర్యపరచింది. చివరి నిమిషంలో ఈ మార్పు వ్యవహారం అంతా వాస్తవానికి బిజెపీ వ్యూహమే. 2024 ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ మార్పులుచేర్పులు చేసిందనే అభిప్రాయాలు అంతటా వ్యక్తమవుతున్నాయి. మొదట ఫడ్నవీస్ బయటనుంచే మద్దతునిస్తానని అన్నారు. కానీ ఆయన్ను ఉపముఖ్యమంత్రిగా వుండేందుకు అంగీకరించేలా చేయడానికి ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, బిజెపి ఛీఫ్ నడ్డా రంగం లోకి దిగాల్సి వచ్చింది. సరే పార్టీ పెద్దలంతా చెబుతున్నారు గనుక ఫడ్నవీస్ సరే అనకా తప్పలేదు. గతంలో ముఖ్యమంత్రిగా చేసి ఇపుడు ఉప ముఖ్యమంత్రిగా చేయడానికీ అంగీకరించిన రాజకీయ నాయ కులలో ఫడ్నవీస్ నాలుగవ స్థానంలో వున్నారు. ఇక్కడ గమనించాల్సిందేమంటే, ఈ విధంగా పద వుల్లో మార్పులు చేర్పులు చేయడం ద్వారా శివసేనను చీల్చినట్టే అయింది. అంతేకాదు ఎన్‌సిపి అధినేత శరద్ పవార్‌కు మహారాష్ట్రలోనే పెను సవాల్ విసిరినట్టు అయింది. పవార్ పశ్చిమ మహారాష్ట్ర సతారాకు చెందిన నాయకులు. అక్కడి నుంచి వచ్చిన యువ నాయకుడు షిండే!మహారాష్ట్రంలో బిజెపి ఓటు బ్యాంక్‌ను మాధవ్ అని తొలినాళ్లలో పిలిచేవారు. మాధవ్ అంటే మాధవుడు కాదు. మాలి, ధనగీర్, వంజారా కమ్యూనిటీలు. అయితే మోదీ ప్రధాని అయిన తర్వాత ఓబీసీ, అర్బన్ ఓటర్లకు బిజెపి ప్రచారాలు, పిలుపులు బాగా ఆకట్టుకున్నాయి. బిజెపి పట్ల మొగ్గు చూపారు. ఇక ఇపుడు ఏకంగా మరాఠా రాజకీయ నాయకుడినే ముఖ్యమంత్రిని చేయడం ద్వారా బిజెపి వారి దృష్టిలో మహో న్నతంగా ఎదిగింది. ఇది తప్పకుండా వారికి 2024 ఎన్నికల్లో 32 శాతం మరాఠా ఓట్లు పడడానికి ఎంత యినా ఉపకరిస్తుంది. షిండేను ముఖ్యమంత్రి చేయడంలో ఉద్ధవ్ థాక్రే వర్గానికి బిజెపి చిన్నపాటి హెచ్చరిక చేసినట్టయింది. రాష్ట్రంలో అతి పెద్ద పార్టీ అయినప్పటికీ మహారాష్ట్రంలో ముఖ్యమంత్రి పదవిని తమ పార్టీవారికి కాకుండా హిందూత్వ రక్షణ ఆలోచనతోనే శివసేనకు చెందిన షిండేకు కట్టబెట్టామని చెప్పుకుంటోంది. అందువల్ల పెద్ద వ్యూహమే షిండేను మంత్రించింది! 2019 ముంబయి నగర మేయర్ ఎన్నికల్లో కూడా బిజెపి ఎన్నికల్లో పోటీ చేయ కుండా శివసేనకే ఆ పదవి దక్కించుకునేందుకు వీలు కల్పించింది. బిజెపి కుటుంబపాలనను తిరస్క రిస్తుంది. థాక్రే కుటుంబం మహారాష్ట్రను ఏలడానికి బిజెపీ వర్గీయులకు ససెమిరా నచ్చలేదు. అందుకే చిన్న స్థాయినుంచి శివసేనలో చెప్పుకోదగ్గ నాయకునిగా నిలిచి ఏకంగా థాక్రేకు ఝలక్ ఇవ్వగలిగిన షిండేను ముఖ్యమంత్రిని చేయడంలో బిజెపి ఆలోచన. మరో వైపు మహారాష్ట్ర అసెంబ్లీలోని శివసేన కార్యాలయం మూతపడింది. థాకరే నేతృత్వంలోని వర్గం, షిండే నేతృత్వంలోని వర్గం కూడా అసలైన శివసేన తమద ంటే తమదని చెపుతున్న నేపథ్యంలో అసెంబ్లీ ఆవరణలోని శివసేన కార్యాలయానికి ఆదివారం సీల్ వేశారు. సీల్ వేసిన కార్యాలయం బయట శివసేన లెజిస్లేటివ్ పార్టీ ఆదేశాల మేరకు కార్యాలయాన్ని మూసివేసినట్లు నోటీసు అతికించారు.సలైన శివసేన తమదేనంటూ ఇటు ఉద్ధవ్ థాకరే సారథ్యంలోని శివసేన వర్గం, ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని రెండో వర్గం క్లెయిమ్ చేస్తుండటంతో మహారాష్ట్ర అసెంబ్లీలోని శివసేన కార్యాలయానికి ఆదివారంనాడు సీల్ వేశారు. కార్యాలయం వెలుపల నోటీసు అంటించారు. "శివసేన లెజిస్లేటివ్ పార్టీ కార్యాల యం ఆదేశాల మేరకు కార్యాలయాన్ని మూసివేశాం" అని ఆ నోటీసు ;పెట్టారు. షిండే వర్గం నేతలు తాము శివసేనను విడిచి పెట్టలేదని, మెజారిటీ సభ్యులు తమవైపే ఉన్నందున తమదే అసలైన శివసేన అని చెబుతుంటే.. షిండే వర్గం వాదన చెల్లదని, పార్టీ లోగో, గుర్తింపు పొందిన ధనుస్సు, బాణం గుర్తు వారికి ఎంతమాత్రం చెందదని ఉద్ధవ్ థాక్రే వర్గం వాదిస్తోంది.ఇదంగా 2024 ఎన్నికల్లో సత్తా చాటడానికి ముందస్తుగా పావులను కదుపుతూ విపక్షాలకు నిద్ర లేకుండా చేయాలన్న వ్యూహరచనే?!

# రగిలిపోతున్న నాని



విజయవాడ, జూలై 5,మాజీ మంత్రి పేర్ని నాని అసంతృప్తితో ఉన్నారా? తనను మంత్రి వర్గం నుంచి తప్పించడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారా? లేక తన స్థానంలో జోగి రమేష్ కు ఇచ్చినందుకు అసహనంతో ఉన్నారా? లేక ఎంపీ బాలశౌరి విషయంలో హైకమాండ్ తనను తప్పుపట్టిందని గుర్రుగా ఉన్నారా? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం ఆయన వ్యవహార శైలితోనే అర్థమవుతుంది. గత కొంతకాలంగా పేర్ని నాని పార్టీతో అంటీ ముట్టనట్లు ఉంటున్నారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇవ్వడం తప్పించి ఆయన పెద్దగా పార్టీలో యాక్టివ్ గా లేరు. జిల్లా వైసీపీ ప్లీనరీలో ఆయన వ్యవహరించిన తీరు అందరినీ ఆశ్చర్యచకితులను చేసింది. జిల్లా అధ్యక్షుడిగా ప్లీనరీకి హాజరైన పేర్ని నాని సమావేశానికి ముందు వైఎస్ విగ్రహానికి దండ వేయడానికి నిరాకరించారు. నిజానికి వైఎస్ వల్లనే తాను రాజకీయాల్లోకి వచ్చానని అనేకసార్లు పేర్ని నాని బహిరంగంగానే చెప్పారు. మిగిలిన నేతలు చెబుతున్నా ఆయన పట్టించుకోనట్లే వ్యవహరించారు. ఆయనను బలవంతం పెట్టడం ఇష్టం లేక నేతలే వెనక్కు తగ్గారు. దీంతో పేర్ని నాని పార్టీ అధినాయకత్వంపై కొంత ఆగ్రహంతో ఉన్నారని స్పష్టంగా కనపడుతుంది. జగన్ ముందుగానే మంత్రి పదవి రెండున్నరేళ్లు అని మాత్రమే చెప్పారు. కానీ మూడేళ్లు కొనసాగించారు. నో డౌట్ పేర్ని నాని ప్రభుత్వానికి అండగా నిలిచారు. సమాచారశాఖ మంత్రిగా ఆయన సమర్ధవంతంగా వ్యవహరించారు. ప్రత్యర్థుల విమర్శలను తిప్పికొట్టడంలోనూ, ప్రజలకు అర్థమయ్యేలా సమస్యలను వివరించడంలోనే పేర్ని నాని తర్వాతే ఎవరైనా అనే పేరు తెచ్చుకున్నారు. స్మూత్ గానే చురకలు అంటిస్తూ, సెటైర్లు వేస్తూ అవతలి వారి గాలి తీసే పేర్నినాని మీడియా సమావేశాలు హైలెట్ అనే చెప్పుకోవాలి.. తనను జగన్ మంత్రి పదవిలో కొనసాగిస్తారని పేర్ని నాని భావించి ఉండవచ్చు. ఆ కారణం కాకపోయినా ఎంపీ బౌలశౌరి విషయంలో తనను తప్పుపట్టడం నాని జీర్ణించుకోలేకపోతున్నారంటున్నారు. అందుకే మంత్రి పదవి నుంచి తప్పుకున్నాక జగన్ ను కలవడానికి కూడా ఇష్టపడటం లేదు. వచ్చే ఎన్నికల్లోనూ తాను పోటీ చేయనని చెప్పేశారు. తన కుమారుడు పేర్ని కృష్ణమూర్తిని బరిలోకి దింపుతారంటున్నారు. నానిది అప్పుడే రాజకీయాల నుంచి తప్పుకునేంత వయసు కాదు. ఆయన మరో రెండు దఫాలు పోటీ చేసే అవకాశం, సత్తా ఉన్న నేత. ఆయన పార్టీ హైకమాండ్ వైఖరి నచ్చకే పోటీ చేయనని చెప్పేశారన్నది పార్టీ వర్గాల నుంచి విన్పిస్తున్న టాక్. మరి పేర్ని నాని చివరకు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది వేచి చూడాలి.

## క్రాస్ రోడ్స్ లో ఎర్రజెండాలు

విజయవాడ, జూలై 5, ఆంధ్రప్రదేశ్ లో వామపక్షాల పరిస్థితి ఎటూ కాకుండా ఉంది. ఇటు ప్రజల్లో పరపతి పడిపోయింది. మరోవైపు పొత్తులతో వెళదామనుకున్నా చివరి క్షణంలో ఏమవుతుందో అర్థంకాని పరిస్థితి. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో వామపక్ష పార్టీలు ఎవరితో పొత్తు పెట్టుకున్నా ఒక్క చోట కూడా గెలుపు సాధ్యం కాలేదు. కొత్త రాష్ట్రంలో దశాబ్దకాలం పాటు శాసనసభలో ప్రాతినిధ్యం లభించలేదు. ప్రాంతీయ పార్టీలకు కొన్ని దశాబ్దాలుగా తోక పార్టీలుగా మారిపోయాయి. ఈసారి ఎన్నికల్లో కనీసం కొన్ని స్థానాల్లోనైనా గెలిచేందుకు వామపక్ష పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. సీపీఐ ఒక అడుగు ముందుకేసి 2019 ఎన్నికల తర్వాత నుంచి టీడీపీతో తిరుగుతోంది. టీడీపీతో కలిస్తే ఈసారి సులువుగా ఎమ్మెల్యే స్థానాలను ఒకటి రెండింటినైనా గెలుచుకోవచ్చని ఆశపడుతుంది. అందుకే ఆ పార్టీ నేతలు ప్రతిపక్ష టీడీపీతో కలిసి పోరాటం చేస్తున్నారు. చివరి క్షణంలో చంద్రబాబు బీజేపీతో పొత్తు పెట్టుకుంటే మాత్రం వీరి ఆశలు అడియాసలయినట్లే. సీపీఎం కూడా టీడీపీతో అంత అంటకాగకపోయినా కొంత అనుకూలంగా వ్యవహరి అధికార వైసీపీ ఎటూ దరి చేరనివ్వదు. ఇక జనసేన ఒంటరిగా పోటీ చేసినా గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయిన పరిస్థితిని గుర్తు తెచ్చుకుంటున్నారు. గతంలో మాదిరి వామపక్షాలకు ప్రజల్లో బలం లేదు. వారికి ఒకప్పుడు కంచుకోటలుగా ఉన్న నియోజకవర్గాలు కూడా చేజారి పోయాయి. ఎర్రజెండాలు అక్కడక్కడా కన్పిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో గెలుపొందగల బలమైన ఓటు బ్యాంకు లేదు. దీంతో వామపక్షాలను ఏ పార్టీ దరిచేరనివ్వని పరిస్థి?తి నెలకొంది. వామపక్షాలకు ఒక్క టీడీపీయే దిక్కుగా మారనుంది. అదీ ఈసారి చంద్రబాబు ఒంటరిగా పోటీ చేస్తేనే వీలవుతుంది. అందులో కూడా చంద్రబాబు వారు ఆశించిన స్థానాలు ఇచ్చే అవకాశం లేదు. ఒకవేళ చంద్రబాబు ఇస్తే గిస్తే ఐదారుకు మించి వారికి సీట్లు ఇచ్చే ఛాన్స్ లేదు. వామపక్ష పార్టీలు క్రమంగా కనుమరుగయిపోతున్నాయి. ఎర్రజెండాలకు ఏపీ పొలిటిక్స్ లో స్థానం లేదన్నది వాస్తవం. వారికి ప్రజల మద్దతు కూడా క్రమంగా దూరమవుతుంది. మరి వచ్చే ఎన్నికల్లోనూ వామపక్షాల పరిస్థితి క్రాస్ రోడ్స్ లో ఉందనే చెప్పాలి.

# డామిట్...కథ అడ్డం తిరిగిందా

ఏలూరు, జూలై 5, బీజేపీ. జనసేనల మధ్య దూరం పెరిగిందా? ప్రధాని మోడీ భీమవరం పర్యటనకు, ఆయన పాల్గొనే భారీ బహిరంగ సభకు జనసేనాని పవన్ కల్యాణ్ కు అందుకే ఆహ్వానం అందలేదా? అన్న ప్రశ్నలకు రాజకీయ పండితులు ఔనెనే సమాధానం ఇస్తున్నారు.ఇప్పటి కిప్పుడు ఆ రెండు పార్టీలూ కూడా తమ మధ్య మైత్రి చెడిందని బహిరంగంగా ప్రకటించకపోయినా.. జనసేన, బీజేపీల మధ్య సంబంధాలు బెడిసాయనడంలో ఎటువంటి సందేహం లేదని వారు నొక్కి వక్కాణిస్తున్నారు. ప్రధాని మోడీ ఏపీలో పర్యటిస్తున్నా..జనసేనాని పవన్ కల్యాణ్ ఆ ఛాయలకు కూడా వెళ్లకపోవడాన్ని ఇందుకు నిదర్శనంగా వారు చూపుతున్నారు. తాను భీమవరంలో అల్లూరి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్లలేకపోవడానికి బిజీ షెడ్యూల్ కారణమని పవన్ కల్యాణ్ చెబుతున్నా.. ఇరు పార్టీల మధ్యా సఖ్యత ఉండి ఉంటే షెడ్యూల్ మార్చుకునైనా పవన్ కల్యాణ్ హాజరై ఉండేవారని వారు విశ్లేషిస్తున్నారు. వాస్తవానికి అల్లూరి విగ్రహావిష్కరణకు పవన్ హాజరౌతారనీ, మోడీతో వేదిక పంచుకుంటారనీ మొదటి నుంచీ జనసేన వర్గాలు చెబుతూ వస్తున్నాయి. అయితే ఇటీవలి కాలంలో ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై బీజేపీ, జనసేనల మధ్య జరిగిన మాటల యుద్ధంతో ఇరు పార్టీల మధ్యా సఖ్యత చెడింది.ఆ తరువాతే పవన్ కల్యాణ్ వరుస కార్యక్రమాలతో బిజీ అయ్యారు. పొత్తుల సంగతి ఎత్తకుండా తన పని తాను సుకుపోతున్నారు. మళ్లీ గతంలోలా ఓట్ల కోసం పుట్టిన పార్టీ జనసేన కాదనే పల్లవి అందుకున్నారు. ఇక మోడీతో వేదిక పంచుకోలేకపోవడానికి కారణాలు చెబుతన్నా.. ఆజాదీ కా అమృతోత్సవల్ లో భాగంగా అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ గొప్ప కార్యక్రమం అంటూ వీడియో విడుదల చేసినా.. పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమానికి దూరంగా ఉండటం కచ్చితంగా బీజేపీ జనసేనల మధ్య చెడిన సంబంధాలనే ఎత్తి చూపుతున్నాయని సామాన్య ప్రజలు సైతం భావిస్తున్నారు. అయితే రాజకీయంగా అత్యంత ఆసక్తికరమైన అంశమేమిటంటే.. అల్లూరి విగ్రహావిష్కరణ కార్యక్రమానికీ, ఆ తరువాత జరిగే మోడీ బహిరంగ సభకూ తెలుగుదేశం పార్టీ తరపున ఆ పార్టీ ఎమ్మెల్యేలు నిమ్మల రామా నాయడు, మంతెన శివరామరాజు మాజరు కానున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి అధికారిక షెడ్యూల్ లో వీరిరువురి పేర్లూ ఉన్నాయి. అయితే జనసేన నేతల ప్రస్తావనే లేదు. మరో వైపు ఇటీవల సినిమా టికెట్ల వ్యవహారంలో జగన్ తో భేటీ అయిన మెగాస్టార్ చిరంజీవి ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం ఆహ్వానం మేరకు హాజరౌతున్నారు. రాజకీయాలకు దూరంగా ఉన్న చిరంజీవిని ఆహ్వానించి... రాజకీయాలలో క్రియాశీలంగా వ్యవహరిస్తూ ఇంకా చెప్పాలంటే.. బీజేపీకి మిత్రపక్షంగా ఉన్న పవన్ కల్యాణ్ కు ఆహ్మానం పంపకపోవడాన్ని పరిశీలకులు ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఎత్తి చూపుతున్నారు. ఇక కేంద్ర పర్యటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతున్నా.. అంతా రాష్ట్ర ప్రభుత్వ ఇష్టారాజ్యం గానే ఆహ్వానితుల జాబితాను రూపొందించారన్న విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. స్థానిక ఎంపీ రఘురామకృష్ణం రాజు ప్రొటోకాల్ ప్రకారం తన సొంత నియోజకవర్గానికి వస్తున్న మోడీకి ఆహ్వానం పలకాల్సి ఉంటుంది. కానీ ప్రధాని పర్యటనకు హాజరయ్యే వారి జాబితాలో ఆయనకు చోటు దక్కలేదు. దీంతో ఆయన హైదరాబాద్ లోనే ఉండిపోయారు. ఆయన పేరు జాబితాలో లేకపోవడానికి ఆయన రాక రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యంగా సీఎం జగన్ కు ఇష్టం లేకపోవడమే కారణమన్నది జగద్విితితమే. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వం ఏం చెబితే అది మాత్రమే చేసిందనడానికి ప్రొటోకాల్ ను సైతం పక్కన పెట్టేయడమే నిదర్శనమని విమర్శలు వినవస్తున్నాయి.

## వైసీపీలో రగులుతున్న కుంపట్లు

విజయవాడ, జూలై 5, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, వైసీపీ ప్రభుత్వ ముఖ్య సలహాదారు, సజ్జల రామ కృష్ణా రెడ్డి, ఇంకో కీలక పదవిలో ఇంకొక రెడ్డి .. ఇలా పార్టీలో , ప్రభుత్వంలో అంతటా, ఆ రెండు అక్షరాలదే హవా... ఈమాటలు అన్నది, అంటున్నదీ ఎవరో కాదు, పార్టీ ఆవిర్భావం నుంచి వైసీపీలో క్రియాశీలంగా మెలుగుతూ, పార్టీ గెలుపు కోసం శక్తీ వంచన లేకుండా, అహర్నిశలు శ్రమించిన అన్య 'కుల' కార్యకర్తలు నాయకులు. ఇందులో ఎస్సీలున్నారు, ఎస్టీలున్నారు. ఓసీ లున్నారు. బీసీలు, మైనారిటీలున్నారు. అందరిలోనూ అసంతృప్తి వుంది.అయినా, ముఖ్యమంత్రి జగన్ రెడీ మాత్రం, అదేమీ పట్టించుకోవడం లేదు. దీంతో ఇప్పుడు, అన్య సామాజిక వర్గాల నాయకులు, కార్యకర్తలు పునరాలోచనలో పడ్డారని తెలుస్తోంది. ఈ మధ్యనే, వైసీపీ పార్టీకి అనుబంధ సంఘాల ప్రకటించారు. ఇందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల విభాగాలకు మాత్రం ఆయా వర్గాలకు ఇచ్చారు. ఇతర సంఘాలు అన్నింటినీ ఆ 'రెండు' అక్షరాల సామాజిక వర్గానికే కట్ట బెట్టారు. మొత్తం 24 విభాగాలకు అధ్యక్షులను ప్రకటించారు. అందులో అత్యధికులు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారనే ఆరోపణలు పార్టీలో బలగా వినిపిస్తున్నాయి.కాగా, అనుబంధ సంఘాల బాధ్యులుగా నియమితులైన వారిలో ... 'బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, నాగిరెడ్డి, పూనూరు గౌతంరెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, గుర్రంపాటి దేవేందర్ రెడ్డి, చల్లా మధుసూదన్ రెడ్డి, పామిరెడ్డి మధుసూదన్ రెడ్డి, పుత్తా ప్రతాప్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, కల్పలతా రెడ్డి, మేడపాటి వెంకట్ రెడ్డి, సునీల్ పోశింరెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి ఇలా, అందరి పేరు ఆ రెండు అక్షరాలతోనే ముగుస్తుంది. ఇందులో ఐటీ, సోషల్ మీడియా, పార్టీ ఆఫీస్, యూత్ వింగ్, రైతు విభాగం ఇలా అన్నీ ఉన్నాయి. అయితే ఎందుకనో ఏమో కానీ, ముస్లిం మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ, బీసీ, ఎస్టీ, ఎస్టీల సంఘాలకు మాత్రం ఆయా సామాజిక వర్గాలకే బాధ్యతలు ఇచ్చారు. ఇలా ఒకే ఒక్క సామాజిక వర్గానికి పెద్ద పీట వేయడం పై విమర్శలు వస్తున్నా, పార్టీ మాత్రం, అవేమీ పట్టించుకోవడంలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలానే కాదు, ఓసీలకు జగన్ రెడ్డి మొండి చేయి చుపారని, అయన దృష్టిలో ఒక్క రెడ్లు వినా, ఓసీలు, ఇతర సామాజిక వర్గాలు కనిపించవు అనే విమర్శలు వినవస్తున్నాయి.అయితే, ఇప్పుడు ఇతర సామాజిక వర్గాలు వైసీపెలో తమకు జరుగతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తున్నాయి.మా వాటా మాకు కావాలని డిమాండ్ చేస్తున్నాయి. సామాజిక న్యాయం పేరిట, పొరుగు రాష్ట్రానికి చెందిన బీసీ సంఘం నాయకుడు ఆర్ . కృష్ణయ్యకు ఏకంగా రాజ్యసభ సభ్యత్వం ఇచ్చిన జగన్ రెడ్డి పార్టీని నమ్ముకుని పని చేస్తున్న బీసీలు, ఇతర సమాజిక వర్గాలను మోసం చేస్తున్నారని అంటున్నారు. ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే, తిరుబాటు తప్పదని, పార్టీ నేతలు హెచ్చరిస్తున్నారు.

# మాజీలు.. జంప్ జిలానీలు

నెల్లూరు, జూలై 5, వైసీపీలో నేతల మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నట్లే కనిపిస్తున్నది. ముఖ్యంగా వైసీపీ ప్లీనరీకి ముందు జిల్లాలలో జరుగుతున్న సమావేశాలు రసాభాసగా మారుతున్నాయి. ఆ సమావేశాలలో పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలు పార్టీలో అంతర్గత విభేదాల గుట్టు రట్టు చేస్తున్నాయి.ఎన్టీఆర్ జిల్లా గుంటుపల్లిలో జరిగిన పార్టీ సమావేశంలో మంత్రి జోగి రమేష్ చేసిన వ్యాఖ్యలు పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సమక్షంలోనే ఆయన వైసీపీ నేతలకు కొందరు పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నారని కుండబద్దలు కొట్టారు. ముఖ్యంగా మాజీ మంత్రి వెల్లంపల్లి ఈ రోజు వైసీపీలోనే ఉన్నా ముందు ముందు ఉంటారన్న నమ్మకం లేదని మంత్రి జోగి రమేష్ అన్నారు. మంత్రి జోగి రమేష్ వ్యాఖ్యలతో వేదికపై ఉన్నవారితో పాటు కార్యకర్తలు ఖంగుతిన్నారు. జోగి రమేష్ ఒక్కరే కాదు మంత్రి బొత్స సత్యనారాయణ సైతం తన నియోజకవర్గ పరిధిలో జరిగిన పార్టీ సమావేశంలో ఇటువంటి వ్యాఖ్యలే చేశారు. పార్టీ నుంచి క్యాడర్ జారిపోతోంది.. జాగ్రత్త పడకుంటే కష్టం అన్న రీతిలో మాట్లాడారు.నెల్లూరు జిల్లా నేతలైతే తమ విభేదాలతో రచ్చకెక్కుతున్నారు. మంత్రి బాలినేని విషయం కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. సొంత పార్టీ నేతలే తనకు వ్యతిరేకంగా కుట్ర చేస్తున్నారని ఆయన పలు సందర్భాలలో బహిరంగంగా చెప్పారు. గుడివాడ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొడాలి నాని అయితే గన్నవరం, బందర్ నియోజకవర్గాలలో వచ్చే ఎన్నికలలో పార్టీ అభ్యర్థులు ఎవరన్నది ప్రకటించేసి ఆయా నియోజకవర్గాలలో ఇప్పటికే ఉన్న గ్రూపు తగాదాలకు అజ్యం పోశారు. ఇలా ఇక్కడ ప్రస్తావించిన జిల్లాలలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వైసీపీలో గ్రూపు తగాదాలు శృతి మించి రాగానపడ్డాయని పార్టీ వర్గాలే అంగీకరిస్తున్నాయి. దీనికి కారణం విజయసాయి, సజ్జలలే కారణమని పార్టీ శ్రేణులు అంతర్గత సంభాషణల్లో చెబుతున్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లోకి విజయసాయి రీ ఎంట్రీ తర్వాతే జిల్లాల్లోని నేతల మధ్య ఉన్న గ్రూప్ తగాదాల రచ్చ పెచ్చరిల్లిందని అంటున్నారు.వైయస్ జగన్ ప్రతిపక్ష నేత నుంచి ముఖ్యమంత్రి పీఠం ఎక్కే వరకు విజయసాయిరెడ్డి పాత్ర పార్టీలో అత్యంత కీలకం.. నాడు ఆయన ఆధ్వర్యంలోనే 2019 ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపిక లగాయతు.. జగన్ తొలి కేబినెట్ కూర్పు జరిగింది. ఆ తర్వాత ఆయన ఉత్తరాంధ్ర ఇన్ చార్జ్‌గా వైజాగ్ వెళ్లిపోయారు.. ఆ తర్వాల అంతా ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చూసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వివిధ జిల్లాలోని పదవులు రాని కీలక నేతలంతా ఆయన చుట్టూ చేరారు. అక్కడ నుంచి ఏ జిల్లాలో జిల్లాల్లో ఎక్కడ ఏ నాయకుల మధ్య అసంతృప్తి జ్వాలలు ఎగిసినా సజ్జల రామకృష్ణారెడ్డి డైరెక్ట్‌గా రంగంలోకి దిగి.. సముదాయించడం జరుగుతూ వస్తోంది. అయితే విజయసాయిరెడ్డిని ఉత్తరాంధ్ర బాధ్యతల నుంచి తప్పించి.. జిల్లా అధ్యక్షులు, సమన్వయ కర్తల బాధ్యతలు అప్పగించడంతో జిల్లాల్లో రచ్చకు అంకురార్పణ జరిగిందని అంటున్నారు. సజ్జల, విజయసాయి రెండు అధికార కేంద్రాలుగా మారడంతో జిల్లాల్లో పార్టీ నేతలు, క్యాడర్ రెండు వర్గాలుగా విడిపోయిన పరిస్థితి ఏర్పడిందంటున్నారు.. సజ్జల, విజయసాయి మధ్య విడిపోయిన జిల్లాల నేతల పంచాయితీ ఇప్పుడు వారు కూడా తీర్చలేని స్థితికి చేరుకుందనీ, దీంతో ఇవన్నీ జగన్ వద్దకు చేరుతున్నాయనీ పార్టీ కేడర్ చెబుతున్నారు. ఆసమయంలో జనంలో వైసీపీ పాలన పట్ల వ్యతిరేకత పెరుగుతుంటే.. మరోవైపు తెలుగుదేశం, జనసేనలు బలోపేతం అవుతున్నాయి. ఆ రెండు పార్టీలు బలోపేతం అవుతున్నాయనడానికి జనసేన సభ, తెలుగుదేశం మహానాడుల సక్సెసే తార్కాణమని వైసీపీ క్యాడరే బహిరంగంగా చెబుతోంది.

# టీడీపీలో దుబాయ్ గోల

ఒంగోలు, జూలై 5,కుప్పంలో ఓడిపోయినా టీడీపీ అక్కడ గెలిచి రికార్డు సృష్టించింది. అధినేత కూడా అన్ని వేదికలపైనా ఆ గెలుపు గురించే మాట్లాడుతున్న సమయంలో ఒక్కసారిగా దుబాయ్ గోల వచ్చిపడింది. దీంతో జెట్ స్పీడులో దూసుకుపోతున్న పార్టీ కాస్తా ఇప్పుడు సైలెంటైంది. దీంతో తమ్ముళ్లలో ఎక్కడలేని అయోమయం ఏర్పడిందట. ఇంతకీ దర్శి టీడీపీలో దుబాయ్ గోల తీరేదెపుడు?ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు గందరగోళంలో పడిపోయారట. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఓడినా ఆ తర్వాత తొలిసారిగా జరిగిన దర్శి నగర పంచాయతీ ఎన్నికల్లో గెలిచి ఫుల్ స్వింగ్‌లోకి వెళ్లిపోయామనుకున్నారట. కానీ టీడీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బాదుడేబాదుడు కార్యక్రమంతో, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మాత్రం జరగటం లేదట. గత అసెంబ్లీ ఎన్నికల్లో దర్శి నుండి వైసీపీ అభ్యర్ధి మద్దిశెట్టి వేణుగోపాల్ గెలిచారు. 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచిన శిద్దా రాఘవరావు గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా కూడా పనిచేశారు. అయితే గత ఎన్నికల్లో ఆయన ఒంగోలు లోక్ సభ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు.. ఆ తర్వాత వైసీపీలో చేరారు.మరోపక్క గత ఎన్నికల్లో దర్శినుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిన కదిరి బాబురావు కూడా వైసీపీలో చేరటంతో కొంతకాలం దర్శి టీడీపీ స్థానం ఖాళీగా ఉంది. దీంతో ఆ పార్టీ అధిష్టానం పమిడి రమేష్ కు పార్టీ నియోజకవర్గ భాధ్యతలు అప్పగించింది. గతంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేసిన రమేష్ ఇంఛార్జి బాధ్యతలు తీసుకున్న తర్వాత సమర్ధవంతంగానే పనిచేశారనే టాక్ పార్టీలో వచ్చింది. పైగా దర్శి నగర పంచాయతీ ఎన్నికల్లో గెలుపు కూడా సాధించారు. కుప్పంలో ఆ పార్టీ ఓడినా ఇక్కడ మాత్రం ఒన్ సైడ్ విక్టరీని సాధించగలిగింది .టీడీపీ గెలుపుకు వైసీపీలో ఉన్న లుకలుకలు మరో కారణం అయినప్పటికీ అందివచ్చిన అవకాశాన్ని ఆ పార్టీ ఇంఛార్జ్ రమేష్ వినియోగించుకోవటంలో సఫలమయ్యారనే టాక్ ఉంది. దీంతో చంద్రబాబు కూడా ప్రకాశం జిల్లా నేతలందరూ సమిష్టిగా పనిచేసి క్లిష్ట పరిస్దితుల్లో పార్టీని నిలబెట్టారని, ఏపీలో ఎక్కడ పార్టీ కార్యక్రమం జరిగినా గుర్తు చేస్తున్నారు. ఒంగోలు మహానాడులో కూడా చంద్రబాబు మహానాడు తర్వాత, దర్శి నియోజకవర్గంలో గందరగోళ పరిస్దితులు ఏర్పడ్డాయట. మహానాడు కార్యక్రమ సమయంలో ప్రస్తుతం దుబాయ్ లో ఉంటున్న సుబ్బారావు అనే వ్యక్తి సినీనటుడు బాలకృష్ణతో కలిసి చంద్రబాబును కలవటం, అవకాశం ఇస్తే దర్శి నుండి పోటీ చేస్తానని ఆ పార్టీ అధినేత చంద్రబాబు ముందు చెప్పారట.దుబాయ్ సుబ్బారావు పేరు వినిపించగానే దర్శి టీడీపీలో గందరగోళం మొదలైందట. అదే సమయంలో పార్టీ పిలుపునిచ్చిన బాదుడే బాదుడు, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు కూడా జరగకపోవటంతో పార్టీ శ్రేణుల్లో అయోమయం ఏర్పడింది. ఇప్పటి వరకూ ఫుల్ జోష్‌లో ఉన్నామనుకుంటున్న పార్టీ శ్రేణులకు అసలేం జరుగుతుందనే అనుమానాలు మొదలయ్యాయట.ఈ అనుమానాలకు తగ్గట్టుగానే ఆ పార్టీ ఇంఛార్జ్ పమిడి రమేష్ కూడా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారట. కార్యకర్తలకు అందుబాటులో ఉండటం లేదట. మహానాడు సమయంలో దుబాయ్ సుబ్బారావు పేరు సీన్ లోకి వచ్చిన తర్వాత రమేష్ అసంతృప్తిగా ఉంటున్నారని స్థానిక నేతలు చెప్పుకుంటున్నారు. మరోపక్క టీడీపీ, జనసేన మధ్య పొత్తు కుదిరితే జనసేనకు దర్శి టికెట్ కేటాయించవచ్చన్న ప్రచారం కూడా ఊపందుకుంది. ఈ పరిణామాల మధ్య అసలు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో నిజమెంత ? పమిడి రమేష్ సైలెంట్ అవటానికి కారణాలేంటి? దుబాయ్ సుబ్బారావు దర్శి టీడీపీలో ఎంటర్ అవుతున్నారా? అధినేత మనసులో అసలేముంది.

# ఆలీతో సరదాగా జగన్

గుంటూరు, జూలై 5, వైసీపీ అధినేత జగన్ ఎప్పుడు ఎవరిని దగ్గరకు తీస్తారో.. ఎప్పుడు ఎవరిని దూరం నెట్టేస్తారో ఎవరికీ ఎప్పటికీ అర్ధం కాదు. కేబినెట్ పునర్వ్యవస్థీకరణ సమయంలో అప్పటి దాకా మంత్రివర్గంలో నోరెట్టుకు విపక్షాల మీద పడిపోయి.. అధినేత మన్ననలు పొంది ఆయనకు సన్నిహితులుగా మెలిగిన వారంతా మాజీలైపోయి.. ఎక్కడా కనిపించక, వినిపించక కనుమరుగైపోయిన సంగతి తెలిసిందే.అంతకంటే ముందు పార్టీ విపక్షంలో ఉన్న సమయం నుంచీ అంతా తానై చక్రం తిప్పిన విజయసాయి పరిస్థితీ అంతే ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్తగా ఆయన పరిధిని పరిమితం చేసేశారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్నందున విజయసాయి మాజీ మంత్రుల్లా ఎవరికీ పట్టకుండా మిగిలిపోకుండా తప్పించుకున్నారు. సరే ఇప్పుడు ఆయన పరిధిని జగన్ ఒకింత పెంచారు అది వేరే సంగతి. విషయమేమిటంటే.. జగన్ ఎవరిని ఎందుకు దగ్గరకు తీస్తారో.. ఎవరిని ఎందుకు దూరంపెట్టేస్తారో అంటే సమాధానం చెప్పేవారు వైసీపీలోనే లేరన్నది మాత్రం వాస్తవం.అసలు జగన్ కైనా అందుకు లాజికల్ కారణాలు తెలుసా అంటే అదో మిలియన్ డాలర్ల ప్రశ్నే. తాను జైల్లో ఉన్న సమయంలో పార్టీ బాధ్యతలను భుజస్కంధాలపై వేసుకుని మోసిన సొంత తల్లి విజయమ్మ, సోదరి షర్మిలల పరిస్థితి ఇప్పుడు ఏమిటి? అలాగే 2019 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరిన ఆయన, కొద్ది కాలం పాటు ఆ పార్టీలో ఓ వెలుగు వెలిగారు. అ ఎన్నికలలో పార్టీ గెలుపు కోసం,చాలాచాలా కష్ట పడ్డారు. జగన్మోహన్ రెడ్డిని వేనోళ్ళ పొగుడుతూ, ఉరూరా తిరిగారు. పార్టీ ప్రచారంలో చురుగ్గా పాల్గొన్నారు. పనిలో పనిగా, తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ టార్గెట్' గా విమర్శలు గుప్పించారు. నోరుంది ఎందుకంటే, రాజకీయ ప్రత్యర్ధులను విమర్శించే అందుకే అన్నట్లు విరుచుకు పడ్డారు.సరే అధికారంలోకి వచ్చిన తరువాత పృధ్వీ కష్టానికి తగిన ఫలితం అనే విధంగా జగన్ ఆయనకు ఎస్వీబీసీ ఛైర్మన్ పదవి కట్టబెట్టారు. కారణాలేమైతేనేం అది మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. ఆ తరువాత వైసీపీలో ఆయనను పట్టించుకున్న నాథుడే లేడు. ఇక తాజాగా అలీ పరిస్థితి



కూడా కొంచం అటూ ఇటూగా థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ పృధ్వీ పరిస్థితే ఎదురయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు. సినిమా థియేటర్ల టికెట్ల రేట్ల తగ్గింపు అంశంపై చర్చించేందుకు టాలీవుడ్‌లోని పలువురు ప్రముఖ నటులు తాడేపల్లిలో సీఎం జగన్ ను కలిసిన సందర్భంగా అలీని జగన్ ప్రత్యేకంగా పిలిపించుకున్నారు.అలీతో పాటు పోసాని కృష్ణ మురళి కూడా ఉన్నారు అది మరో సంగతి. వారితో భేటీ అనంతరం జగన్ అలీని ప్రత్యేకంగా పిలిచి మాట్లాడారు. త్వరలో పిలుపు వస్తుంది సిద్ధంగా ఉండమని జగన్ అలీకి చెప్పారు. దీంతో అలికి వైసీపీలో కీలక పదవి ఖాయమనీ, కనీసం రాజ్యసభ సభ్యత్వం అయినా కట్టబెడతారనీ ఓ టాక్ అటు ఇండస్ట్రీలోనే కాదు.. రాజకీయ వర్గాలలోనూ జోరుగా సాగింది. ఈ ఊహాగాన సభలకు ఊతమా అన్నట్లు ఇది జరిగిన కొద్ది రోజులకే అలీ కుటుంబ సమేతంగా తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లి జగన్ తో భేటీ అయ్యారు. ఆ భేటీ తరువాత అలీ మీడియాతో తనకు ఏదో పదవి ఖాయమన్న ధీమా వ్యక్తం చేశారు. జగన్ కు తనకు ఎప్పుడు ఏం ఇవ్వాలో తెలుసునని మర్మగర్భంగా చెప్పారు. అయితే ఇది జరిగి కూడా అర్ధ సంవత్సరం గడిచిపోయింది. అలీకి దక్కింది ఏమీ లేదు. ఎదురు చూపులు తప్ప. ఇప్పుడు పరిస్థితి ఎలా మారిందంటే సర్కార్ ఏర్పడి మూడేళ్లు పూర్తయిపోయింది. ఇప్పుడు ప్రభుత్వ దృష్టి అంతా తదుపరి అసెంబ్లీ ఎన్నికలపైనే ఉంది. గడువుకు ముందే ఎర్లీ ఎలక్షన్లకు వెళ్లే యోచనలో జగన్ ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అలీకి పార్టీ పదవి ఇచ్చే అవకాశాలు దాదాపు మృగ్యమేనని వైసీపీ వర్గాలే అంటున్నాయి. అంటున్నారు. గత ఎన్నికలకు ముందు ఇండస్ట్రీలో తనకు ఎంతో సన్నిహితుడిగా ఉన్న పవన్ కల్యాణ్ ను కాదని మరీ అలీ వైసీపీ గూటికి చేరారు. ఆ తరువాత ఆ విషయంలో పవన్ ఒకింత బాధను వ్యక్తం చేశారు కూడా. మన వాళ్లు అనుకున్న వారూ, మన సహాయం పొందిన వారూ కూడా స్వార్ధ ప్రయోజనాల కోసం పాకులాడటంపై పవన్ కొన్ని వ్యాఖ్యలు చేశారు. దానికి అలీ చాలా షార్ప్ గా రియాక్ట్ అయ్యారు. పవన్ కల్యాణ్ గారూ మీ నుంచి నేనేం సహాయం పొందానండీ, సినిమా చాన్స్ లేమైనా ఇప్పించారా అంటూ వ్యంగ్య బాణాలు వదిలారు. అది అప్పటి సంగతి. ఇప్పుడు జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తరువాత అలీ పరిస్థితి ఏమిటి... ఇదిగో అదిగో అని ఊరించడమే తప్ప... నాడు ఎన్నికల సమయంలో రాజమండ్రి లేదా గుంటూరు నుంచి అసెంబ్లీకి పోటీ చేయడానికి అవకాశం అడిగితే... ఎమ్మెల్యేగా కాదు అంత కంటే పెద్ద పదవి అంటూ ఊరించడం తప్ప ఈ మూడేళ్లలో అలీకి జగన్ చేసిందేమీ లేదు. రాజ్యసభ టికెట్లో, నామినేటెడ్ పోస్టో ఇచ్చే ఉద్దేశమే నిజంగా జగన్ కు ఉంటే అలీకి ఇన్నేళ్లు ఇలా కళ్లు కాయలు కాసేలా ఏదురు చూడాల్సిన అవసరం ఉండేది కాదు.సినిమాల్లో అందరినీ నవ్వించే కమేడియన్ అలీని జగన్ ఊరించి ఊరించి ఊసూరు మనిపించారని సామాజిక మాధ్యమంలో నెటిజన్లు జోకులేస్తున్నారు. ఇప్పటికే నిరాశలో కూరుకుపోయిన అలీ వైసీపీతో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని పార్టీ శ్రేణులే అంటున్నాయి. పార్టీ కోసం కష్టపడిన థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీకి కనీసం మూన్నాళ్ల ముచ్చటగానైనా ఏదో పదవి దొరికింది.. కానీ కెరీన్ ను, ఇండస్ట్రీలో సన్నిహితులతో సంబంధాలనూ ఫణంగా పెట్టి మరీ జగన్ వెంట నడిచిన అలీకి అది కూడా దొరకలేదన్న సానుభూతి సామాజిక మాధ్యమంలో వెల్లువెత్తుతోంది.

# నేడు మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి

భారత దేశ అగ్రశ్రేణి నాయకుల్లో ఒకడుగా, భారత స్వాతంత్ర్య ఉద్యమంలోను, నవభారత నిర్మాణంలో ఉదాత్తమైన పాత్ర నిర్వహించిన జగ్జీవన్ రామ్, 1908, ఏప్రిల్ 5న బిహార్ రాష్ట్రంలోని షాబాద్ జిల్లా, చాంద్వా గ్రామంలో బసంతీదేవి, శోభిరామ్ దంపతులకు జన్మించారు. అయనను ప్రజలకు లభించిన 'అన్మోల్ రతన్' (అమూల్యరత్నం) అని పిలుస్తారు. బాబూ జగ్జీవన్ రామ్. పండిట్ నెహ్రూ నుంచి కార్యదక్షుడిగా మన్ననలను పొంది, అప్పటి ఆచారాల ప్రకారం 8వ ఏటనే బాల్యవివాహం జరిగింది. ప్రాథమిక పాఠశాల విద్య ముగిసిన తర్వాత 1928లో ఆయన కాశీని వదలి కలకత్తాకు వెళ్లి అక్కడ 1931లో బిఎస్సీ డిగ్రీని పొందారు. చదువుకునే రోజుల్లో మదన్ మోహన మాలవ్యా, పండిత గోవింద వల్లభ పంత్లతో పరిచయం ఏర్పడింది. విద్యాభ్యాసం ముగిసిన తర్వాత బాబూ రాజేంద్ర ప్రసాద్తో కలిసి దళితుల సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1933లో భార్యా వియోగం జరగడంతో, 1935లో సంపన్న కుటుంబానికి చెందిన 'ఇంద్రాణి'ని వివాహం చేసుకున్నారు. బిహార్ రాష్ట్ర హరిజన సేవా సంఘ కార్యదర్శిగా పనిచేసారు. బిహార్లో భూకంపం సంభవించినప్పుడు మహాత్మాగాంధీతో పాటు జగ్జీవన్ రామ్ సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.. డాక్టర్ రాజేంద్రప్రసాద్, టక్కర్ బాబాల ఆశీర్వాదంతో రిజర్వ్ నియోజకవర్గం నుంచి నాటి శాసనసభకు ఎన్నికయ్యారు. 1935 ఇండియా చట్టం కింద రాష్ట్రాల్లో మంత్రివర్గాలు ఏర్పడినప్పుడు బిహార్ రాష్ట్ర మంత్రివర్గంలో ఆయన మొదటిసారి పార్లమెంటరీ కార్యదర్శి అయ్యారు. 1937లో బిహార్ రాష్ట్ర కార్మికశాఖ మంత్రిగా పనిచేశారు. వ్యష్టి సత్యాగ్రహంలో పాల్గొని హజారిబాగ్ జైల్లో ఉన్నప్పుడు ఆయనకు జయప్రకాశ్ నారాయణ్తో పరిచయం ఏర్పడింది. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, జగ్జీవన్ రామ్, జయప్రకాశ్ నారాయణ్లు బిహార్ త్రిమూర్తులుగా పేరు తెచ్చుకున్నారు. 1946లో నెహ్రూ నాయకత్వంలో అవిభక్త భారత్లో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వంలో కార్మికశాఖను నిర్వహించారు. 1947లో అంతర్జాతీయ కార్మిక సమావేశంలో పాల్గొని తిరిగివస్తుండగా, బస్రా సమీపంలో ఆయన ప్రయాణం చేస్తున్న విమానం ప్రమాదానికి గురైంది. తీవ్రంగా గాయపడిన ఆయన నెల రోజులపాటు బ్రిటీష్ సైనిక ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆ తర్వాత 1948లో హైదరాబాద్లో జరిగిన దళిత వర్గాల మహాసభకు ముదిగొండ లక్ష్మయ్య అధ్యక్షత వహించగా, జగ్జీవన్ రామ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 1952లో నెహ్రూ మంత్రివర్గంలో తపాలాశాఖను, 1956లో రైల్వేశాఖను నిర్వహించారు. తదనంతరం వ్యవసాయశాఖ మంత్రిగా దేశంలో హరి త విప్లవానికి కారణభూతుడై ఆహార ధాన్యాలను నిల్వ చేయడానికి వీలుగా "?భరత ఆహార సంస్థ" (ఎఫ్సిఐ), సెంట్రల్ వేర్ హౌజింగ్ కార్పొరేషన్లను ఏర్పా టు చేశారు. నెహ్రూ అనంతరం లాల్బహదూర్ శాస్త్రీ, ఇందిరాగాంధీ మంత్రివర్గంలో మళ్లీ కార్మిక, ఉపాధి కల్పనాశాఖలు లభించాయి. 1967లో వ్యవసాయశాఖకు మారారు. కిద్వాయ్ తర్వాత వ్యవసాయశాఖను సమర్ధవంతంగా నిర్వహించారన్న పేరు సంపాదించుకున్నారు. కాంగ్రెస్ రెండుగా చీలినప్పుడు ఇందిరాగాంధీ పక్షాన ఉంటూ 1969లో బొంబాయిలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో జగ్జీవన్ రామ్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎంపికయ్యారు. తర్వాతికాలంలో ఆయన రక్షణ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. 1976లో దేశంలో విధించిన అత్యవసర పరిస్థితికి నిరసనగా కాంగ్రెస్ పార్టీకి, మంత్రిపదవికి రాజీనామా చేశారు. తర్వాత కాంగ్రెస్ ఫర్ డెమోక్రసీ అనే పార్టీని స్థాపించారు. బాబూ జగ్జీవన్ రామ్ ప్రజాభిమానం కలిగిన నాయకులు. 1977, మార్చి 6న గుంటూరులో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగాన్ని వినడానికి గత 38 ఏళ్లలో ఎన్నడూ రానంతమంది జనం వచ్చారు. రామ్కు ఆంధ్రా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది. అలుపెరుగని తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానికి ఇక సెలవంటూ, 1986, జులై 6న ఈ లోకాన్ని వీడారు.

## నిత్య పెళ్లి కూతురు అడ్డంగా బుక్

తిరుపతి, జూలై 5, ఆమె అందంగా ఉంటుంది. ఆ అందం, అభినయంతో జీవితాన్ని ఎంజాయ్ చేద్దామని నిర్ణయించుకుంది. అలా ముగ్గురి దగ్గర మూడు పేర్లు చెప్పి వివాహం చేసుకుంది. చివరికి కిలాడీ లేడీ విషయం తెలిసి మోసపోయిన భర్తలు లబోదిబోమంటున్నారు. తమిళనాడు రాజధాని చైన్నైలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన సంచలనంగా మారింది. చెన్నై ఆవడి సమీపంలోని ముత్తు పుదుపేట రాజీవ్‌నగర్‌కు చెందిన హరి (44) ఎంసీఏ పూర్తి చెన్నైలోని ఓ ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. హరికి 2008లో చెన్నైలోని కొలత్తూరు ప్రాంతానికి చెందిన ఓ యువతితో వివాహమైంది. మనస్పర్థల కారణంగా వీరు 2014లో విడాకులు తీసుకొని విడివిడిగా ఉంటున్నారు. దీంతో హరి మరో వివాహం చేసుకునేందుకు పెళ్లి సంబంధాలు చూస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటి పని చేస్తున్న వ్యక్తి ద్వారా ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లాలోని పుత్తూరుకు చెందిన శరణ్య అనే యువతిని చూశాడు. ఆ సమయంలో ఆమె తనకు 35 ఏళ్లు అని బంధువులు ఎవరూ లేరని చెప్పింది.దీంతో హరి, శరణ్యను గతేడాది వివాహం చేసుకున్నాడు. పెళ్లి అనంతరం ఆస్తి వివరాలను చెప్పాలంటూ శరణ్య హరితో తరచూ గొడవపడేది. ఆస్తులను తనపై పేరు రాయలంటూ పేర్కొనది. చివరికి వరకట్న వేధింపులు గురి చేస్తున్నారంటూ భర్త, అత్త ఇంద్రాణిపై శరణ్య తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో హరి తల్లి ఇంద్రాణి.. కూడా ఆవడి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు విచారణ చేపట్టగా.. శరణ్య నిజమైన పేరు సుగణ అని తేలింది. శరణ్యకు 50 ఏళ్లని.. ఇదివరకే తిరుపతికి చెందిన రవి అనే వ్యక్తితో వివాహం జరిగిందని, ఇద్దరు కుమార్తెలున్నరని తెలిసింది. దీంతో ఆవడి పోలీసులు శరణ్యను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.ఇదిలాఉంటే.. తిరుపత్తూరు జిల్లా జోలార్‌పేట సమీపంలోని వక్కనంపట్టి గ్రామానికి చెందిన సుబ్రమణి శనివారం ఆవడి పోలీసులకు ఓ ఫిర్యాదు చేశాడు. తాను సేలం, ఈరోడ్డు, కాట్పాడి వంటి రైల్వేస్టేషన్‌లోని క్యాంటిన్‌లో పని చేస్తున్నానని 2010లో ఆరణికి చెందిన ఏజెంట్ ద్వారా శరణ్యకు తనకు వివాహం జరిగినట్లు వివరించారు. తన వద్ద ఆమె పేరును సంధ్య అని చెప్పిందని.. గత పదేళ్లుగా శరణ్యతో తాను జీవించానని తమకు పిల్లలు లేరని పేర్కొన్నాడు. 2021 జూలైలో మేట్టుపాళ్యంలో రైల్వే క్యాంటీన్‌లో పనికి వెళ్లిన సమయంలో శరణ్య తనను వదిలి వెళ్లి పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు శరణ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## మంత్రాలయం జడ్పీ హైస్కూల్లో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ






మంత్రాలయం నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను ప్రధానోపాధ్యాయులు అంపయ్య మంగళవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అంపయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ప్రభుత్వం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసిందని పాఠశాల పునః ప్రారంభం రోజున విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేయడం ఆనందంగా ఉందని తెలిపారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు అందరికీ జగనన్న విద్యా కానుక పథకం కింద యూనిఫాము, స్కూల్ బ్యాగు ,బూట్లు ,టెక్ట్స్ పుస్తకాలు, నోటుబుక్కులను ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు అంపయ్య మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల చదువుల కోసం ఎన్నో సౌకర్యాలు కల్పించిందని అమ్మ ఒడి విద్యా కానుక లాంటి పథకాలు గొప్ప పథకాలని అన్నారు.విద్యార్థులు కూడా అన్ని పథకాలను సౌకర్యాలను అందిపుచ్చుకొని మంచిగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. గత సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో మా జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి మండల టాపర్ గా నిలవడం ఆనందంగా ఉందన్నారు. చాలా రోజుల సెలవుల తర్వాత విద్యార్థులకు పాఠశాలకు రావడంతో విద్యార్థిని విద్యార్థులు చాలా ఆనందం వ్యక్తం చేశారు. ఎప్పుడెప్పుడు పాఠశాలలు తెరుస్తారా ఎప్పుడు ఎప్పుడు బడికి పోదామా అంటూ ఇన్నాళ్లు ఎదురు చూసామని ఆరోజు ఈరోజు రానే వచ్చిందని విద్యార్థిని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ చెప్పారు. విద్యార్థిని విద్యార్థులు చాలా రోజుల తర్వాత కలుసుకోవడంతో ఒకరిని ఒకరు పలకరించుకుంటూ ఆనందం వ్యక్తం చేసుకున్నారు. అలాగే టీచర్లను కూడా కలుసుకొని చాలా ఆనందం వ్యక్తం చేశారు. ఇన్ని రోజులు సెలవులలో పిల్లలు దూరం అవడంతో ఈరోజు పాఠశాల పునః ప్రారంభం రోజున పిల్లలందరితో కలసి పాఠశాలలో గడపడం చాలా ఆనందంగా ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాలలో పాఠశాలకు ఉపాధ్యాయులకు విద్యార్థులకు విడదీయరాని సంబంధం ఉందని, పాఠశాలలో వారి వారి జీవితాలలో ఎన్నో మధురానుభూతులు కలగలిసి ఉంటాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు .విద్యార్థులకు పాఠాలు చెప్పడం వారిని జీవితంలో ఉన్నత విద్యావంతులుగా జ్ఞనవంతులుగా తీర్చిదిద్దడం మాకు ఎంతో ఆనందాన్నిస్తుందని ప్రధానోపాధ్యాయులు అంపయ్య ఇతర ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంపయ్యతో పాటు సీనియర్ ఉపాధ్యాయులు బందే నవాజ్, శ్రీనివాసులు శెట్టి, తిమ్మప్ప ,నాగభూషణం, నాగరాజు, అస్లాం, ప్రభాకర్ రావు ,కేఎం. శ్రీనివాసులు ,బసవరాజు, బి. శ్రీనివాసులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## నలుగురు మత్స్యకారులు గల్లంతు

మచిలీపట్నం కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం క్యాంబెల్ పేట నుండి చేపల వేటకు వేటకు వెళ్లిన మత్యకారుల ఆచూకీ గల్లంతు అయినట్లు సమాచారం. నాలుగు రోజుల క్రితం వేటకు వెళ్లిన నలుగురు మత్స కారులు, కాకినాడ సమీపంలో బోటు మోటారు పని చేయడం లేదని యజమానికి సమాచారం ఇచ్చారు. తరువాత వారి ఫోన్లు పని చేయక పోవడంతో కుటుంబ సభ్యులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. వారి కోసం కుటుంబసభ్యులు గ్రామంలో ఎదురు చూస్తున్నారు. సమచారం అందుకున్న మెరైన్ సిబ్బంది వారి ఆచూకీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

## మురుగునీటి కాలువలో దిగిన ఎమ్మెల్యే

నెల్లూరు రైల్వే, మున్సిపల్ అధికారుల తీరుని నిరసిస్తూ మురుగునీటి కాలువలోకి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి దిగారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి 21వ డివిజన్ ఉమ్మారెడ్డి గుంటలో డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉందన్నారు. వందల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా మురుగునీరు వచ్చి చేరుతోందని కోటంరెడ్డి పేర్కొన్నారు. ఈ సమస్య అనేక సంవత్సరాలుగా ఉందన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఎప్పుడో ప్రశ్నించానన్నా రు. రైల్వే, కార్పొరేషన్ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకున్నారని వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన మూడేళ్ల నుంచి కూడా అధికారులతో మాట్లాడుతున్నా కూడా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కార విషయంలో అధికారమా? ప్రతిపక్షమా? అనేది ఉండదని.. ప్రజల పక్షాన ఉంటానన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. తాను కూడా బాధపడుతున్నానన్నారు. రైల్వే అధికారుల మొండి తీరు, కార్పొరేషన్ అధికారుల నత్తనడకని ప్రశ్నిస్తూ మురుగు గుంతలోకి దిగుతున్నానని కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి వెల్లడించారు

## 11 వతేదిన జరుగు సమ్మెను జయప్రదం చేయండి

### సిఐటియు నాయకుల పిలుపు

నంద్యాల మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన మాట తప్పిన వై.ఎస్.ఆర్ . సీపీ ప్రభుత్వం 2022 జూలై 11 నుండి జరిగే మున్సిపల్ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్ కె మహమ్మద్ గౌస్ మున్సిపల్ వర్కర్ సీనియర్ అధ్యక్ష కార్యదర్శులు కృష్ణయ్య భాస్కరాచార్యులు తెలిపారు ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కృష్ణయ్య అధ్యక్షత వహించగా సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్ కె మహమ్మద్ గౌస్ యూనియన్ కార్యదర్శి భాస్కరాచారి లు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందుకు అనేక వాగ్దానాలు మున్సిపల్ కార్మికులకు ఇచ్చినారని మూడు సంవత్సరాలు పూర్తయిన కూడా ఏ ఒక్క సమస్యను పరిష్కారం చేయడం లేదని ముఖ్యంగా హెల్త్ అలవెన్స్ బకాయిలతో సహా చెల్లించాలని, 11 వ , పీఆర్సీ సిఫార్సుల ప్రకారం నెల జీతం రూ . 26 వేలు మరియు కరువు భత్యం చెల్లించాలని, మున్సిపల్ పారిశుధ్యం , ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చెయ్యాలని,ఇంజనీరింగ్ కార్మికులకు జీఓ ఆర్.టి.నెం .30 నవరించి స్కిల్ , సెమీ స్కిల్డ్ జీతాలు చెల్లించాలని,పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవ్స్ , జీపీఎఫ్ అక్కౌంట్లు , హెల్త్ కార్డులు ఇవ్వాలని, సీపీఎస్ రదు చేయాలి . ఎన్.ఎం.ఆర్ . లకు టైమ్స్కేల్ , కరువు భత్యం , స్కూల్ ఆయాలకు కనీస వేతనం చెల్లించాలని, పట్టణ విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచాలి . సకాలంలో కార్మికులకు పనిముట్లు , రక్షణ పరికరాలు అందించాలని,ఆప్కాస్ ద్వారా రిటైర్మెంట్ చేసిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ , బిడ్డలకు ఉద్యోగం ఇవ్వాలి . రిటైర్మెంట్ బెనిఫిట్స్ , గ్రాట్యూటీ - పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు.అనంతరం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీకి అధ్యక్ష కార్యదర్శులుగా కృష్ణయ్య, భాస్కరాచారి, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, ఆ దా వ ు ు , క రి వ ు ు ల్లా , స హా య ు కా ర్య ద ర్శు ల ు గా నాగేశ్వరరావు,రామాంజనేయులు,డి.నాగేంద్రప్రసాద్ ,మురళి ,కోశాధికారిగా వెంకటరమణ లతో పాటు కమిటి సభ్యులుగా పవన్,బసవయ్య,రాజశేఖర్ ,గురు,ఈశ్వరయ్య,ఎల్ .యం.రెడ్డి ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

## రెండు బైకులు ఢీ?ఒకరికి తీవ్ర గాయాలు

ప్రకాశం ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం గోళ్లవిడిపి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీకొన్నాయి..ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108లో యర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం, మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించినట్లు సమాచారం. తీవ్రగాయాలైన వ్యక్తి గోళ్లవీడిపి చెందిన పెద్దన్నగా గుర్తించారు

## టీడీపీ నూతన తెలుగుమహిళ నగర కమిటీ నియామకం...

కడప కడప నగరంలోని కోపరేటివ్ కాలనీలో గల తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వి.ఎస్ అమిర్ బాబు తన కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ తెలుగుమహిళ నగర కమిటీని నూతనంగా నియమించడం జరిగింది. అనంతరం అమీర్ బాబు మాట్లాడుతూ.......✓ కార్యకర్తలు, ఒక జాన్సీ లక్ష్మి భాయ్,లాగ పనిచేయాలని, అలాగే రాబోయే రోజులలో తెలుగు దేశం పార్టీని కడప నగరంలో జెండా ఎగురవేయాలని, ఈ రాష్ట్రానికి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంతో పాటు మహిళలల పోరాటము ఎంతో అవసరమని,వైసిపి ప్రభుత్వంలో మహిళలకు అదరణ కరువైందని, ఏంతో మందికి అమ్మఒడి దు?రం చె?సారని, అమి?ర్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు సానపు రెడ్డి శివ కోండా రెడ్డి, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జయ కుమార్, మరియు మహిళ నగర అధ్యక్షురాలు మురికినాటి సునీతా,మహిళ నగర ప్రధానకార్యధర్శి వరదా పార్వతి నగర ఉపాధ్యక్షులరాలు పెయ్యల ప్రణవతి, కార్యదర్శి కందుకు?రి వజయలక్ష్మి, సయ్యద్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం చేయలేక ఉద్యోగానికి రాజీనామా

కాకినాడ, జూలై 5, రాజోలు వైసీపీ రాజీనామాల పర్వం కొనసాగుతున్నది. ఇప్పటికే పలువురు ముఖ్య నేతలు రాజీనామాలు సమర్పించగా.. తాజాగా ఆ పార్టీ నియోజకవర్గ మాజీ ఇంఛార్జ్ బొంతు రాజేశ్వరరావు కూడా తన పదవికి రాజీనామా చేశారు. బొంతు రాజేశ్వర్‌రావు పీఆర్, ఆర్?డీ అండ్ ఆర్?డబ్ల్యూఎస్ సలహాదారుగా ఏపీ సీఎం జగన్ నియమించారు. ఈ పదవితో ప్రజలకుగానీ, పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకుగానీ ఎలాంటి న్యాయం చేయలేకపోతున్నందుకే రాజీనామా చేస్తున్నట్లు రాజేశ్వరరావు ప్రకటించారు. రాజేశ్వరరావు రాజీనామాపై వ్యాఖ్యానించేందుకు జిల్లా మంత్రి, సీనియర్ నేతలు ముందుకు రావడం లేదు.కోనసీమ జిల్లా లక్కవరంలో ఆ పార్టీ అసమ్మతి నేతల సమావేశం రెండు రోజుల క్రితం జరిగింది. ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో సీనియర్ నేతలు హాజరయ్యారు. దాదాపు 11 ఏండ్ల పాటు కష్ట నష్టాలకోర్చి పార్టీ అభివృద్ధికి పనిచేసినా గుర్తింపు లేదని సమావేశానికి హాజరైన పలువురు సీనియర్ నేతలు వాపోయినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తమపైనే వేధింపులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో నెలకొన్న అసమ్మతిని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు.

## ఎర్ర చందనం స్మగ్లర్లపై పోలీసుల మెరుపుదాడి

కడప జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎర్రచందనం స్మగ్లర్లపై పోలీసుల మెరుపు దాడులు జరిపారు. అంతర్ రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్ ఫక్రుద్దీన్ తో పాటు మరో ఏడు మంది స్మగ్లర్లను అరెస్ట్ చేసారు. రెండు కేసుల్లో సుమారు రెండు టన్నుల బరువున్న 55 దుంగలు, నాలుగు కార్లు, 9.5 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కడప జిల్లా, ఇతర ప్రాంతాల్లో 71 ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో ముద్దాయిగా ఉన్న చాపాడు మండలం కదిరిపల్లెకు చెందిన అంతర్రాష్ట్ర స్మగ్లర్ ఫక్రుద్దీన్ తోపాటు యాసీన్, తమిళనాడుకు చెందిన కామరాజు, కాజీపేటకు చెందిన వీరభద్రుడు, ప్రకాశం జిల్లాకు చెందిన గోపి నాయక్, అనంతపురం జిల్లాకు చెందిన బోయ అరవింద్ లను అరెస్ట్ చేసారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అన్బు రాజన్ హెచ్చరించారు. ఎర్రచందనం అక్రమ రవాణా గుట్టు రట్టు చేసిన కడప జిల్లా ఫ్యాక్షన్ జోన్ డిఎస్పీ చెంచు బాబు, టాస్క్ ఫోర్స్ సి.ఐ లు నాగభూషణం, సత్యబాబు, ఆర్.ఎస్సై పోతురాజు, ప్రొద్దుటూరు టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇబ్రహీం, సిబ్బంది, చెన్నూరు ఎస్సై శ్రీనివాసులురెడ్డి, ఖాజీపేట ఎస్సై కులాయప్ప మరియు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# ప్రత్యేక హోదాపై హామీ ఇవ్వని మోడీ విధానాలను నిరసిస్తూ ధర్నా




## రామరాజు స్ఫూర్తితో హోదా ఇచ్చేదాకా ఉద్యమించి తీరుతాం

కర్నూలు జూలై 05 -: మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడానికి వచ్చిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ, మాయ మాటలు చెప్పడం తప్ప రాష్ట్రానికి ఏ ఒక్క హామీ ఇవ్వలేదని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం సూర్యారావ్ విమర్శించారు. మంగళవారం ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ గాంధీ విగ్రహం ముందు గంటపాటు ధర్నా నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై నగేష్ అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రత్యేక హోదా సాధన కమిటి రాష్ట్ర నాయకులు, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం సూర్యారావు, ప్రత్యేక హోదా సాధన కమిటీ జిల్లా నాయకులు ఈ పుల్లారెడ్డి, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఆనంద్ బాబు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి వచ్చిన నరేంద్ర మోడీ రాజధాని శంకుస్థాపనకు చెంబు నీళ్ళు, పిడికెడు మట్టి ఇచ్చి చేతులు దులుపుకొని పోయారని, తిరిగి మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు గారి 125వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహ ఆవిష్కరణకు వస్తున్న మోడీ రాష్ట్రానికి మేలు చేస్తాడని ఆశతో ఎదురుచూసినటువంటి ప్రజానీకాన్ని మాటల గారడీతో మోసం చేసి వెళ్లిపోయారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, చిన్న పట్నాన్ని నగరంగా మార్చి లక్షలాదిమందికి ఉపాధి చూపుతున్న విశాఖ ఉక్కు రక్షణ కోసం, ప్రజా సంఘాలంతా ఐక్యంగా ప్రత్యేక హోదా సాధన కమిటీగా ఏర్పడ్డామని, సాధించేదాకా మోడీ పుణ్యభూమిగా పేర్కొన్న ప్రాంతం నుండే అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పోరాట భూమిగా మార్చి హక్కులను సాధించి తీరాలని వారు పిలుపునిచ్చారు. ధర్నా కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామన్న, జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, ఆవాజ్ నగర కార్యదర్శి ఇక్బాల్ హుస్సేన్, కెవిపిఎస్ జిల్లా నాయకులు విజయమ్మ, ఆంధ్రా గురుస్వామి, కృష్ణ, నాయకులు రాజశేఖర్, విజయ్, షరీఫ్, రామకృష్ణ, రాముడు, అంజిబాబు, సాయిబాబా, సుధాకరప్ప, నరసింహులు, సాల్మన్ రాజు, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా కానుకను అందించిన బాబు రెడ్డి

బేతంచెర్ల, రాష్ట్రవ్యాప్తంగా మంగళవారంనాడు పాఠశాలలో ప్రారంభం కాగా ఈరోజే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యా కానుకను కర్నూలు జిల్లాలోని ఆదోని లో ప్రారంభించారు. ఇందులో భాగంగా సోమవారం నాడు బేతంచెర్ల మండల పరిధిలోని గురుమాన్ కొండ గ్రామంలో ఉన్న ఏ.పీ మోడల్ స్కూల్ పాఠశాలలో వై.ఎస్.ఆర్సి.పి మండల ఇంచార్జ్ బాబు రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు స్కూల్ బ్యాగులను యూనిఫామ్తో కూడిన విద్యా కానుక కిట్టును విద్యార్థలకు అందించారు. అదేవిధంగా ఏ. పీ మోడల్ పాఠశాల విద్యార్థి మహా నాగ వాసవి 2021 22 విద్యా సంవత్సరానికి గాను పదవతరగతి మండల టాపర్ గా నిలిచింది అందుకుగాను ఆర్థిక సహాయాన్ని ఆయన పాఠశాల ప్రిన్సిపాల్ షమీల చేతులమీదుగా అందించారు.

# టి ఎం రమేష్ మాదిగ ముందస్తు హౌస్ అరెస్ట్



ఆదోని జూలై 05 -: ఏపీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కర్నూలు జిల్లా ఆదోని పట్టణం నందు విద్యా కానుక ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న సందర్భంగా (ఎమ్ ఆర్ పి ఎస్ ఎస్)మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితిరాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్బొందిమడుగుల టి ఎం రమేష్ మాదిగ ని పోలీసులు ముందస్తుగా ఆయన స్వగృహంలో హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బొందిమడుగుల టి ఎం రమేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో హక్కుల కొరకు శాంతియుతంగా పోరాటం చేసేందుకు రాజ్యాంగం హక్కులు కల్పించిందని, అలాంటిది రాజ్యాంగానికి విరుద్ధంగా పోలీసులు హౌస్ అరెస్టు చేయడం దళితుల గొంతు నొక్కడం అవుతుందని , రెండు నెలల వ్యవధిలోనే 8 ఎనిమిది సార్లు హౌస్ అరెస్టు చేయడం రాజ్యాంగ విరుద్ధం హక్కుల కొరకు ప్రజాస్వామ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై శాంతియుతంగా పోరాటాలు చేసి , తమ జాతి అభివృద్ధి సంక్షేమం సాధికారతే లక్ష్యంగా చివరి రక్తపు బొట్టు వరకు పోరాటం చేస్తానని అన్నారు. అక్రమ కేసులకు అక్రమ అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని , తమ జాతి హక్కులను అధికారులు కాలరాస్తే ప్రశ్నించి బాధితులకు అండగా ఉండి సమస్యలు పరిష్కరించేందుకు శాంతియుతంగా పోరాటాలు చేస్తానని , ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దళితులకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన నిధులను విడుదల చేసి వారి అభివృద్ధికి పాటుపడాలని , దళితులు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని ఎమ్మార్పీఎస్ ఎస్రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్బొందిమడుగుల టీ ఎం రమేష్ మాదిగ డిమాండ్ చేశారు .

# విద్యారంగానికి పెద్ద పీట

-: కర్నూలు జిల్లా కలెక్టర్ కోటేశ్వర రావు





కర్నూలు , జులై , 05 ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్నారని కర్నూలు జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు పేర్కొన్నారు. అంత ప్రాధాన్యత ఇస్తున్నారు కాబట్టే గోరుముద్ద లాంటి పథకంలో పిల్లలకు ఎలాంటి ఆహారం అందించాలో తెలుపుతూ స్వయంగా ఆయనే మెనూ రూపొందించారన్నారు. ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జగనన్న విద్యాకానుక మూడో విడత పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కోటేశ్వర రావు తన ప్రసంగంతో ప్రారంభించారు. ప్రసంగంలో ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక ద్వారా 2022-23 సంవత్సరంలో 2,97,044 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ బ్యాగు, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్, ఒక జత బూట్లు, సాక్స్, బెల్టులతో కూడిన జగనన్న కిట్టు అందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మన బడి-నాడు నేడు పథకం ద్వారా 11 రకాల మౌలిక సదుపాయాలను కల్పించి ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారుతున్నాయన్నారు. నాడు-నేడు ద్వారా ఆదోని పట్టణంలోని వందేళ్ల కిందటి రెండు స్కూళ్లను రూ.3 కోట్ల రూపాయలు వెచ్చించి ఆధునీకరించామన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టడం వల్ల పేద పిల్లలకు అందరితో పోటీ పడే అవకాశం కల్పించినట్టయిందన్నారు. వెనకబడిన ఆదోని ప్రాంతంలో మెడికల్ కాలేజీ, ఏరియా డెవలప్ అథారిటీలు ఏర్పాటు చేయడం, వేదవతి ఎత్తిపోతల పథకం, రాజోలు బండ కుడిగట్టు కాలువ , హంద్రీనీవా ద్వారా నీరు అందించడం వలసల నివారణ జరిగిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న నవరత్నాలు పథకం సృష్టికర్తగా ముఖ్యమంత్రిని కీర్తిస్తూ జిల్లా కలెక్టర్ తన ప్రసంగాన్ని ముగించారు.




కర్నూలు జిల్లా, ఆదోని పర్యటన నిమిత్తం ఓర్వకల్లు ఎయిర్ పోర్ట్ కు విచ్చేసిన గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి కర్నూలు రేంజ్ డీఐజీ ఎస్. సెంథిల్ కుమార్ ఐపీఎస్ పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు.

# విద్యార్ధుల అందోళన

విశాఖపట్నం విశాఖలో గురుద్వార్ టిపిటి కాలనీలో ఉన్న వసంత బాల విద్యోదయ ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. దాతల సహకారంతో పాఠశాల నిర్వహణ కొనసాగుతూ వచ్చిన పాఠశాల ప్రైవేట్ వ్యక్తుల చేతికి చేరడంతో ఫీజుల భారం విద్యా ర్థుల తల్లితండ్రులకు ఆర్థిక భారంగా మారింది. ప్రస్తుతం వసంత బాల పాఠశాలలో సుమారు 350 మంది పేద విద్యార్థులు చదువుతున్నారు. దాతలు, విద్యార్థుల తల్లిదండ్రుల సహాయంతో 1975లో రిజిస్ట్రేషన్ చేశా రు. అయితే అది కాస్తా ప్రైవేట్ వ్యక్తుల చేతికి చేరడంతో ఆ యాజమాన్యం ఫీజులు 25 వేలు కట్టాలని, ఫీజులు కట్టకపోతే టిసిలు తీసుకొని వెళ్లిపోవాలని చెప్పడంపై ఆందోళనకు దిగారు. గతంలో విద్యార్ది సంఘాలు ధర్నాలతో దిగి వచ్చిన విద్యాశాఖ జోక్యం చేసుకొని ప్రభుత్వం ఈ పాఠశాలను స్వాధీనం చేసుకొని నిర్వ హిస్తుందని హామీ ఇచ్చినా అది కార్యరూపం దాల్చక పోవడం విద్యార్థుల చదువుకు ఆటంకంగా మారింది.

# నెట్టింట వైరల్ అవుతున్నఆర్.ఆర్.ఆర్ కాన్సెప్ట్ పోస్టర్!



రాజమౌళి ఆర్.ఆర్.ఆర్'తో ఇండియన్ సినిమా సత్తాని మరోసారి యావత్ ప్రపంచానికి చాటారు. ఇద్దరు క్రేజీ స్టార్ హీరోలు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ ల తొలి కాంబినేషన్ లో రూపొందించిన ఈ భారీ మల్టీస్టారర్ మూవీ ప్రసంచ వ్యాప్తంగా విడుదలై సంచలనాలు సృష్టించింది. ఇండియన్ సినిమా సత్తా ఏంటో యావత్ ప్రపంచానికి తెలియజేసింది. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లని రాబట్టి రికార్డులు క్రియేట్ చేసింది. దర్శకుడు రాజమౌళి విజన్ ని వెండితెరపై ఆవిష్కరించిన తీరు ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకుంది. ఇండియన్ సినీ హిస్టరీలోనే అత్యంత భారీ మూవీగా దేశ వ్యాప్తంగా సంచలనాలు సృష్టించింది. ఓటీటీలో విడుదలైన ఈ మూవీపై హాలీవుడ్ స్టార్స్ ప్రశంసల వర్షం కురిస్తున్నారు. ఈ మూవీ ఓ అద్భుతం అంటూ ఆకాశానికి ఎత్తేస్తున్నారు. తాజాగా హాలీవుడ్ క్రిటిక్స్ సెలెక్ట్ చేసిన టాప్ 10 మూవీస్ జాబితాలో ఆర్.ఆర్.ఆర్ నిలిచి అరుదైన ఘనతని సొంతం చేసుకుంది. ఇలా ఎంపికైన తొలి ఇండియన్ మూవీగా రికార్డుల కెక్కింది. ఇదిలా వుంటే ఈ మూవీలో యంగ్ టైగర్ ఎన్టీఆర్ రామ్ చరణ్ లకు సంబంధించిన కీలక ఘట్టాలు ప్రేక్షకుల్ని అబ్బుర పరిచాయి. ఈ గ్రాఫిక్స్ వర్క్ కి సంబంధించిన బ్రేక్ డౌన్ వీడియోలని మేకర్స్ ఒక్కొక్కటిగా విడుదల చేస్తున్నారు. తాజాగా ఈ మూవీ క్లైమాక్స్ లో రామ్ చరణ్ ని రామరాజుగా.. రాముడిగా చూపించిన ఓ సన్నివేశానికి సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్ ని ఈ మూవీకి గ్రాఫిక్స్ పర్యవేక్షకుడిగా వ్యవహరించిన శ్రీనివాస మోహనన్ సోషల్ మీడియా ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. చరణ్ కాషాయం ధరించి.. చేతిలో విల్లుతో కనిపిస్తుండగా వెనకాల లైటింగ్ విరజిమ్మిన తీరు అచ్చం శ్రీరాముడేనా అనేలా చేసింది. ఈ సీన్ కోసం రాజమౌళి ఓ కాన్సెప్ట్ పోస్టర్ ని రెడీ చేయించారట. ఆ పోస్ట్ ని కూడా శ్రీనివాస మోహనన్ రివీల్ చేశారు. ఆ పోస్టర్ ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. ఆ కాన్సెప్ట్ పోస్టర్ ని యాజిటీజ్ గా సినిమాలో రీక్రియేట్ చేసి వుంటే ఆడియన్స్ థియేటర్లలో లేచి పూనకాలతో ఊగిపోయేవారని తెలుస్తోంది. మరింత ఫెరోషియస్ గా కాన్సెప్ట్ పోస్టర్ కనిపిస్తోంది. అంత కాకపోయినా ఆ రేంజ్ కి దగ్గరలోనే చరణ్ ని క్లైమాక్స్ లో చూపించిన తీరు దక్షిణాది వారినే కాకుండా ఉత్తరాది వారిని కూడా రోమాంచితుల్ని చేసింది. విచిత్రం ఏంటంటే ఈ షాట్ లో రామ్ చరణ్ ని చూసిన దక్షిణాది వారంతా అల్లూరిని గుర్తు చేసుకుంటే ఉత్తరాది వారు మాత్రం శ్రీరాముడిని గుర్తు చేసుకోవడం విశేషం. అంతగా ఆ సీన్ వారిపై ఇంపాక్ట్ ని క్రియేట్ చేసింది. శ్రీరాముడు అంటూ నెట్టింట పోస్ట్ లు పెట్టి హల్ చల్ చేశారు. దీంతో ఈ సీన్ దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.




# కమర్షియల్ బ్యూటీ ఎంతగా కష్టపడుతుందో చూడండి

ఊహలు గుసగుసలాడే సినిమా తో టాలీవుడ్ లో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ రాశిఖన్నా. తెలుగు లో ఈ అమ్మడు బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తూ ఉంది. మీడియం రేంజ్ సినిమాల్లో నటిస్తూ పెద్ద హీరోయిన్ గా పేరు దక్కించుకునే ప్రయత్నం చేస్తోంది. ఇదే సమయంలో తమిళంలో ఈ అమ్మడు వరుసగా స్టార్ హీరోలకు జోడీగా నటిస్తూ ఇప్పటికే అక్కడ స్టార్ హీరోయిన్ గా పేరును దక్కించుకుంది. టాలీవుడ్ లో తాజాగా ఈ అమ్మడు నటించిన చిత్రం 'పక్కా కమర్షియల్'. గోపీచంద్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందిన పక్కా కమర్షియల్ సినిమా రేపు విడుదల కాబోతున్న నేపథ్యంలో ఆ సినిమా ప్రమోషన్ లో రాశి ఖన్నా బిజీ బిజీగా పాల్గొంటుంది. మరో పక్క తమిళ సినిమా షూటింగ్ లో కూడా పాల్గొంటూ రాశి ఖన్నా క్షణం తీరిక లేకుండా గడుపుతోంది. హీరోయిన్ గా రాశి ఖన్నా చేస్తున్న సినిమా లు చాలా ఉన్నాయి. వాటి షూటింగ్.. ప్రమోషన్ కార్యక్రమాలు బ్యాలన్స్ చేసుకుంటూ షిఫ్ట్ లుగా ఈమె వర్క్ చేస్తుంది. తాజాగా రాశి ఖన్నా షేర్ చేసిన వీడియో ఆమె ఎంత బిజీ గా ఉందో అర్థం చేసుకోవచ్చు. షూటింగ్ లో పాల్గొని అక్కడ నుండి ఎయిర్ పోర్ట్ కు హడావుడిగా చేరుకుని వెంటనే సినిమా ఈవెంట్ కు రెడీ అయ్యింది. కొద్ది గంటల తేడాలోనే రెండు భారీ ఈవెంట్స్ లో పాల్గొనడం మాత్రమే కాకుండా మళ్లీ షూటింగ్ లో కూడా పాల్గొనడం ఆమెకే చెల్లింది. హైదరాబాద్ మరియు చెన్నై కి రెగ్యులర్ గా తిరుగుతూ అక్కడ ఇక్కడ బిజీ బిజీ గా ఉన్న రాశి ఖన్నా పక్కా కమర్షియల్ సినిమా హిట్ అయితే స్టార్ హీరోల కు జోడీగా నటించే అవకాశం దక్కించుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. బన్నీ వాసు నిర్మించిన పక్కా కమర్షియల్ సినిమా ను అల్లు అరవింద్ సమర్పించాడు. మంచి కాన్సెప్ట్ తో మారుతి తెరకెక్కించిన ఈ సినిమా సక్సెస్ కావాలంటూ ప్రీ రిలీజ్ వేడుకలో పాల్గొన్న మెగాస్టార్ చిరంజీవి కోరుకుంటూ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశాడు. ఆ సమయంలోనే రాశి ఖన్నా గురించి చిరంజీవి ప్రత్యేకంగా మాట్లాడి ఆమె అందంను మరియు అభినయం గురించి కామెంట్స్ చేశారు.



# భారత్‌పై ఇంగ్లండ్ సూపర్ విక్టరీ.. సిరీస్ సమం




ఎడ్జ్‌బాస్టన్ వేదికగా భారత్‌తో జరిగిన ఐదో టెస్టులో ఇంగ్లండ్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దాంతో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను ఇంగ్లండ్ 2-2తో సమం చేసింది. గతేడాది జరిగిన నాలుగు టెస్టుల్లో భారత్ రెండు, ఇంగ్లండ్ ఒక్క మ్యాచ్‌లో విజయం సాధించగా.. మరో మ్యాచ్ డ్రా ముగిసింది. ఇక 378 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి చేధించింది. ఇంగ్లండ్ బ్యాటర్లల్లో జానీ బెయిర్‌స్టో(114), జో రూట్ (142) సెంచరీలతో చెలరేగారు. ఈ మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌లోనూ బెయిర్‌స్టో సెంచరీలు సాధించాడు. ఇక తొలి ఇన్నింగ్స్‌లో అదరగొట్టిన భారత బౌలర్లు రెండో ఇన్నింగ్స్‌లో పూర్తిగా తేలిపోయారు. కెప్టెన్ బుమ్రా తప్ప మిగితా బౌలర్లు ఒక్క వికెట్ కూడా సాధించలేకపోయారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 416 పరుగులకు ఆలౌటైంది. భారత బ్యాటర్లలో పంత్(146), జడేజా అద్భుతమైన సెంచరీలు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో బెయిర్ స్టో(106) తప్ప మిగితా బ్యాటర్లు ఎవరూ రాణించలేదు. భారత బౌలర్లలో సిరాజ్ నాలుగు, బుమ్రా మూడు, షమీ రెండు వికెట్లు సాధించారు. ఇక తొలి ఇన్నింగ్స్‌లో లభించిన 132 పరుగుల అధిక్యంతో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన భారత్ 245 పరుగులకే ఆలౌటైంది. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో పుజారా(66),పంత్(57) పరుగులతో రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో కెప్టెన్ స్టోక్స్ నాలుగు వికెట్లతో అదరగొట్టగా.. బ్రాడ్, పాట్స్ తలా రెండు, అండర్సన్,జాక్ లీచ్ చెరో వికెట్ సాధించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190